ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



కర్నూలు
జిల్లా వార్తలు

5

సోమవారం 1 డిసెంబరు 2025

ఐదుగురు మరణానికి కారణమైన ఎమ్మిగనూరు మండలం కాశిరాళ్ల మెట్ట మలుపు



మృత్యు మలుపులు..!

ప్రమాదాకరంగా కోటేకల్లు మలుపులు:

ఎన్‌హెచ్-167పై ఆరేకల్లు - కోటేకల్లు గ్రామాల మధ్యలో నాలుగైదు కిలో మీటర్లు దూరం ఉంటుంది. కోటేకల్లు గ్రామ పరిధిలో బాడయ్య చేను క్రాసింగ్ (మలుపు), కాశిరాళ్లమెట్ట మలుపు అత్యంత ప్రమాదకంగా ఉన్నాయని ఆయా గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు. ఇక్కడ తరచూ ఏదో ఒక ప్రమాదం జరుగుతోంది. గత ఐదారేళ్లలో ఆటోలు, కార్లు, లారీలు, మోటర్‌బైక్ ప్రమాదాల్లో 20 మందికి పైగానే దుర్మరణం చెందారని గ్రామస్తులు పేర్కొంటున్నారు. తెల్లారగానే ఎలాంటి దుర్వార్త వినాల్సి వస్తుందో అంటూ ఆవేదన చెందుతున్నారు. ప్రమాదం జరిగినప్పుడు ప్రమాదాల నివారణకు శాశ్వత చర్యలు చేపడుతామని అధికారులు, ప్రజాప్రతినిధులు హామీ ఇవ్వడం, ఆ తర్వాత మర్చిపోవడం మామూలైందని స్థానికులు వాపోతున్నారు.



జాతీయ రహదారి-167 నిత్యం రక్తసిక్తమవుతోంది. ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి. కోటేకల్లు సమీపంలోని రెండు మలుపులు అత్యంత ప్రమాదకరంగా ఉన్నాయి. గడిచిన ఐదారేళ్లలో ఈ ప్రాంతంలో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 25 మందికిపైగా మృత్యువాత పడ్డారు. ఇటీవల నవంబరు 2న ఆదోని మండలం కపటి గ్రామానికి చెందిన కూలీలు పొట్టచేత పట్టుకొని పత్తితీసే పనులకు ఓ ఆటోలో వెళ్లారు. కోటేకల్లు గ్రామ సమీపంలోని బాడయ్య చేను మలుపు వద్దకు ఎదురుగా వస్తున్న మినీ బస్సు ఆటోను ఢీకొట్టింది. ఇద్దరు మృతి చెందారు. 11 మంది గాయపడ్డారు. ఈ రక్తపు మరకలు చెదిరిపోక ముందే.. అక్కడికి కిలోమీటరు దూరంలోని కాశిరాళ్లమెట్ట మలుపు వద్ద శనివారం అర్ధరాత్రి 4.30 గంటల సమయంలో రెండు కార్లు ఢీకొని ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు కర్ణాటక వాసులు మృతి చెందారు. ప్రమాదాలు జరిగినప్పుడు అధికారులు, ప్రజా ప్రతినిధులు రావడం, దిగ్భ్రాంతి వ్యక్తం చేయడం.. ఆ తరువాత మర్చిపోవడం అంతా మామూలైంది. ఆరేకల్లు నుంచి కోటేకల్లు వరకు నాలుగు లైన్లు రోడ్డుగా విస్తరించి, డివైడరు ఏర్పాటు చేస్తే కొంతైనా ప్రమాదాలకు అడ్డుకట్ట వేయవచ్చని స్థానికులు అంటున్నారు. జిల్లాలో జాతీయ రహదారులు నెత్తుటి దారులుగా మారుతున్న తీరుపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

- ఎన్‌హెచ్-167పై ప్రమాదకరంగా కోటేకల్లు మలుపులు
- నిత్యం ప్రమాదాలు ● ఐదేళ్లలో 20 మందికి పైగా దుర్మరణం
- ఆ ప్రాంతంలో నాలుగు లైన్ రోడ్డు, డివైడర్లు ఏర్పాటు చేయాలి

కర్నూలు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల్లో హైదరాబాద్ - బెంగళూరు వయా కర్నూలు జాతీయ రహదారి-44, కర్నూలు - చిత్తూరు వయా నంద్యాల జాతీయ రహదారి-40, బళ్లారి-కోదాడ వయా ఆదోని, ఎమ్మిగనూరు, మంత్రాలయం జాతీయ రహదారి-167 ఉన్నాయి. అదుపులేని వేగం, నిర్లక్ష్యం, రహదారి నిర్వహణ లోపాలు వెరసి జాతీయ రహదారులు రక్తసిక్తమవుతున్నాయి. కర్నూలు నగరానికి సమీపంలో కల్లూరు మండలం చిన్నటేకూరు సమీపంలో ఈనెల 24న రోడ్డుపై పడిన బైక్‌పై నిర్లక్ష్యంగా వి.కావేరి ట్రావెల్ బస్సు వెళ్లడంతో మంటలు చెలరేగి 19 మంది ప్రయాణికులు అగ్నికి ఆహుతైన ఘోర విషాద ఘటన మరవకనే.. ఎమ్మిగనూరు మండలం కోటేకల్లు వద్ద శనివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురు కన్నడిగులు దుర్మరణం పాలయ్యారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, రోడ్డు రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టలేదు. కర్ణాటక, ఏపీ, తెలంగాణ రాష్ట్రాలను కలుపుతూ 2014-15 మధ్యలో అప్పటి ప్రభుత్వం బళ్లారి సమీపంలో ఉన్న హగరి నుంచి తెలంగాణలోని కోదాడ వరకు హాలహర్వి, ఆలూరు, ఆదోని, ఎమ్మిగనూరు, మంత్రాలయం, రాయచూరు, మహబూబ్‌నగర్, జడ్చర్ల, కల్వకుర్తి, దేవరకొండ మీదుగా జాతీయ రహదారి-167 నిర్మించారు. జిల్లాలో హాలహర్వి మండలం చింతకుంట నుంచి మాధవరం వరకు 99.15 కిలో మీటర్లు ఉంది. నిత్యం ప్రమాదాలకు నిలయంగా మారింది. ఆలూరు సమీపంలో హనుమాన్ సర్కిల్ వద్ద, ఆదోని మండలం బైచిగేరి క్రాస్, ఆరేకల్లు వద్ద, ఎమ్మిగనూరు మండలం కోటేకల్లు గ్రామ పరిధిలో కాశిరాళ్లమెట్ట మలుపు, బాడయ్య చేను మలుపు, ఎమ్మిగనూరు పట్టణంలో అన్నమయ్య, ఓంశాంతి, మార్కెట్ యార్డు కూడళ్లు, ముగతి సర్కిల్, మంత్రాయలం మండలం కలుదేవకుంట, చెట్నేపల్లి, మాధవరం కూడలి ప్రమాదాలకు నిలయంగా మారాయి. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుంతో..? ఏ వాహనం ఢీకొడుతుందో..? అంటూ ప్రజలు నిత్యం భయం భయంగా కాలం వెళ్లదీస్తున్నారు.



ఎమ్మిగనూరులో ప్రమాదాలకు నిలయంగా మారిన మార్కెట్ యార్డు కూడలి

ప్రమాదాలు నివారించాలంటే..

- ఆరేకల్లు - కోటేకల్లు మధ్య జాతీయ రహదారి-167ని నాలుగు లైన్ల రహదారిగా విస్తరించి మధ్యలో డివైడర్లు ఏర్పాటు చేయాలి. ముఖ్యంగా నిత్యం ప్రమా దాలు జరిగే రెండు మలుపులు వద్ద వాహనాలు వేగం తగ్గించే చర్యలు కఠినంగా అమలు చేయాలి.
- నిత్యం నేషనల్ హైవే పెట్రోలింగ్ పర్యవేక్షణ ఉండాలి. అర్ధరాత్రి తరువాత ఉదయం వరకు కోటేకల్లు మలుపుల వద్ద పెట్రోలింగ్ విస్తృతం చేయాలి.
- ఎమ్మిగనూరు పట్టణం, మంత్రాలయం, మాధవరం వద్ద గ్రామాల్లో వాహనాలు వెళ్లకుండా తక్షణమే బైపాస్ రోడ్డు నిర్మాణాలు చేపట్టాలి. ఎమ్మిగనూరు, మంత్రాలయం బైపాస్ రోడ్డు ప్రతిపాదన దశలోనే మగ్గుతున్నాయి.
- కాశిరాళ్లమెట్ట మలుపు వద్ద ఇరువైపు అటవీశాఖ భూముల్లో దట్టంగా చెట్లు పెరగడంతో ఎదురెదురుగా వస్తున్న వాహనాలు కనిపించడంతో ప్రమాదాలకు జరుగుతున్నాయి. వాహనాలు కనిపించేలా చెట్లను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

బ్లాక్ స్పాట్లు ఇవే

- హైదరాబాద్ - బెంగళూరు జాతీయ రహదారి-44: కర్నూలు నగరం సంతోష్ నగర్, చిన్నటేకూరు, ఉల్లిందకొండ క్రాస్, దత్తాత్రేయస్వామి ఆలయం సమీపంలో, వెల్దుర్తి సర్కిల్ ఆంజనేయస్వామి విగ్రహం, మదార్‌పురం, ప్యాపిలి క్రాస్ రోడ్డు, కర్నూలు నగర శివారులో వెంకన్నబావి ప్రాంతం.
- బళ్లారి-కోదాడ జాతీయ రహదారి-167: ఆలూరు సమీపంలో హనుమాన్ సర్కిల్, ఆదోని మండలం బైచిగేరి క్రాస్, ఆరేకల్లు వద్ద, ఎమ్మిగనూరు మండలం కోటేకల్లు పరిధిలో కాశిరాళ్లమెట్ట, బాడయ్య చేను మలుపులు, ఎమ్మిగనూరు పట్టణంలో అన్నమయ్య ఓంశాంతి, మార్కెట్ యార్డు కూడళ్లు, ముగతి సర్కిల్, మంత్రాలయం మండలం కలుదేవకుంట, చెట్నేపలి, మాధవరం కూడలి.
- కర్నూలు - చిత్తూరు జాతీయ రహదారి-40: ఓర్వకల్లు, శాంతిరాం కళాశాల వద్ద, అయ్యలూరుమెట్ట కూడలి, యర్రగుంట్ల, శిరివెళ్ల, పెద్దబోదనం, కూలూరు, మద్దూరు, ఆళ్లగడ్డలోకి వెళ్లే మార్గాల కూడళ్లను బ్లాక్ స్పాట్లుగా గుర్తించారు.



నిత్యం ప్రమాదాలకు నిలయమైన కోటేకల్లు బాడయ్య చేను మలుపు

కోటేకల్లు మలుపుల వద్ద జరిగిన ప్రమాదాలు కొన్ని

- కోటేకల్లు గ్రామ సమీపంలో బాడయ్య చేను మలుపు వద్ద 2018 జనవరి 2న టాటా ఏసీ ఆటోను ట్రక్ ఢీకొన్న ప్రమాదంలో ఐదురుగు మృత్యు వాత పడ్డారు. వారిలో ముగ్గురు కోటేకల్లు గ్రామస్తులు, ఇద్దరు బనవాసి ఫారం, ఎమ్మిగనూరుకు చెందిన వారున్నారు.
- ఇదే మలుపు ప్రాంతంలో ఐదేళ్ల క్రితం రెండు కార్లు ఢీకొన్న ప్రమాదంలో బెంగళూరుకు చెందిన ఇద్దరు మృత్యువాత పడ్డారు. ఆ తరువాత వేర్వేరు ప్రమాదాల్లో మరో ఇద్దరు దుర్మరణం చెందారు.
- కోటేకల్లు ఫారెస్ట్ వద్ద జరిగిన ఓ రోడ్డు ప్రమాదంలో ఆదోనికి చెందిన టీడీపీ నాయకురాలి సమీప బంధువు ఒకరు మృతి చెందారు.
- అక్టోబరు 10న కోటేకల్లు గ్రామం వద్ద అటవీ శాఖ ఏర్పాటు చేసిన సిటీ ఫారెస్ట్‌ను తిలకించి బైక్‌పై భార్యాభర్తలు, కొడుకు ఆదోనికి వెళ్తుండగా కాశిరాళ్లమెట్ట పలుపు వద్ద బైక్‌ను వెనుక నుంచి ఓ వాహనం ఢీకొట్టడంతో ఒకరు మృతి చెందారు.

రక్తం చిందిస్తున్న జాతీయ రహదారులు

ఉమ్మడి జిల్లాలో జాతీయ రహదారుల్లో నిత్యం ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. రవాణా శాఖ అధికారుల్లో అలసత్వం, సిబ్బంది కొరత, పోలీసులు శాంతి భద్రత పర్యవేక్షణకే పరిమితం కావడం ప్రమాదాల నివారణ సాధ్యం కావడం లేదు. అనుభవం లేని డ్రైవర్లు, అవగాహన లోపం వల్ల ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారు. మానవ తప్పిదాల వల్లే 95 శాతం ప్రమాదాలు జరిగితే, డ్రైవర్ల నిర్లక్ష్యం వల్ల 75 శాతం, మరో 25 శాతం రోడ్లు, వాహనాల మరమ్మతుల కారణంగా జరుగుతున్నట్లు ఓ సర్వేలో వెల్లడైంది. ఏడాది కాలంలో ఉమ్మడి జిల్లాలో 1,250కి పైగా ప్రమాదాలు జరిగాయి. 550 మందికి పైగా మృత్యువాత పడ్డారని సమచారం.

రోడ్డు డివైడర్లు ఏర్పాటు చేయాలి

ఆరేకల్లు ఉంచి కోటేకల్లు వరకు జాతీయ రహదారిని విస్తరించి డివైడర్లు వేయాలి. అప్పుడే కొంతైనా ప్రమాదాలు నివారించవచ్చు. నేషనల్ హైవే ఇంజనీర్లు స్పందించి డివైడర్లు ఏర్పాటు చేయాలి.

● జె. లక్ష్మన్న, కోటేకల్లు గ్రామం, ఎమ్మిగనూరు మండలం

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వినతులు స్వీకరించనున్నట్లు కలెక్టర్ డా.ఎ.సిరి ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాల్లో మున్సిపల్ కార్యాలయాల్లో, డివిజన్ స్థాయిలో కూడా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగుతుందని ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. దరఖాస్తు పరిష్కారం కాకున్నా పరిష్కారం ఏ దశలో ఉందో సమాచారం తెలుసుకోవడం కోసం కాల్ సెంటర్ నెంబరు 1100కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చన్నారు. అలాగే అర్జీదారులు Meekosam.ap.gov.in వెబ్‌సైట్‌లో వారి అర్జీలు నమోదు చేసుకోవచ్చని అన్నారు.

హామీలను విస్మరించిన కేంద్రం

సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య

పత్తికొండ టౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఇచ్చిన హామీలను కేంద్రం విస్మరించిందని సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య ఆరోపించారు. పట్టణంలోని సీఆర్ భవన్‌లో పట్టణ, మండల సమితి సమావేశం ఆదివారం ఎంపీటీసీ వీరన్న అధ్యక్షతన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు రాష్ట్ర ప్రజానీకానికి అనేక హామీలను ఇచ్చి, అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి కావొస్తున్నా హామీలను అమలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. కేంద్రంలో ప్రధాని మోదీ, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ విధానాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించి పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సీపీఐ శత వార్షికోత్సవాల సందర్భంగా ఈనెల 20 నుంచి 25వ తేదీ వరకు అన్నిశాఖల్లో ఘనంగా నిర్వహించాలన్నారు. జనవరి 18న తెలంగాణ రాష్ట్రం ఖమ్మంలో జరిగే ముగింపు వేడుకలకు పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ మాజీ జిల్లా కార్యదర్శి భీమలింగప్ప, జిల్లా కార్యవర్గ సభ్యులు రాజాసాహెబ్, మండల, పట్టణ కార్యదర్శులు కారుమంచి, రామాంజనేయులు, జిల్లా సమితి సభ్యులు గురుదాస్, తిమ్మయ్య, కృష్ణ, కారన్న, గిడ్డయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ ఎస్‌పీడీసీఎల్ సీఎండీ

కల్లూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా డయల్ యువర్ సీఎండీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సీఎండీ లోతేటి శివశంకర్ తెలిపారు. సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు డిస్కం పరిధిలోని తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, అన్నమయ్య, కడప, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల వినియోగదారులు సమస్యలపై మొబైల్ నెంబరు-8977716661కు కాల్ చేయాలన్నారు.

శ్రీగిరిపై భక్తుల సందడి

ఆది దంపతులకు కళా నీరాజనాలు

శ్రీశైలం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : అష్టాదశ శక్తిపీఠం, ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రమైన శ్రీశైలం భక్తుల తాకిడితో సందడిగా మారింది. ఆదివారం తెల్లవారుజాము నుండి పాతాళ గంగలో పుణ్య స్నానాలు చేసుకుని తలనీలాలు మొక్కులుగా సమర్పించుకున్నారు. ఉభయ దేవాలయాల దర్శనాల కోసం సర్వ దర్శనం భక్తులకు నాలుగు గంటల సమయం, శీఘ్ర, అతిశీఘ్ర దర్శనాలకు రెండు గంటలు, స్పర్శ దర్శనం వీఐపీ బ్రేక్ టిక్కెట్ పొందినవారికి గంట సమయం పట్టిందని ఆలయ అధికారులు తెలిపారు. క్షేత్ర పరిధిలోని ఉద్యానవనాలు, శివాజీ స్ఫూర్తికేంద్రం, రుద్రపార్కులు చిన్నారుల ఆటపాటలతో కిటకిటలాడాయి. కళారాధన వేదికపై సంప్రదాయ నృత్యాలు, భజన గీతాలతో స్వామి అమ్మవార్లకు కళానీరాజనాలు సమర్పించారు.



శ్రీశైల భ్రమరాంబకు పూజలు చేస్తున్న అర్చకులు



స్వామి, అమ్మవార్ల దర్శనం కోసం వేచి ఉన్న భక్తులు

భ్రమరాంబకు పల్లకి సేవ

శ్రీశైల భ్రమరాంబ అమ్మవారికి ఆదివారం సాయంత్రం పల్లకి ఉత్సవం వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి వార పూజల్లో భాగంగా పుష్పాలంకరణ చేసిన పల్లకిలో స్వామి, అమ్మవార్లను ఆసీనులను చేసి పల్లకిలో ఊరేగించారు.

డ్రగ్స్ నిర్మూలనకు చర్యలు

- మంత్రి టీజీ భరత్
- ఈగల్ ఆధ్వర్యంలో డ్రగ్స్ వద్దు బ్రో ర్యాలీ



సైకిల్ ర్యాలీలో పాల్గొన్న మంత్రి టీజీ భరత్

కర్నూలు క్రైం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ నిర్మూలన కోసం రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర వాణిజ్యం, పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ తెలిపారు. ఆదివారం ఈగల్ ఆధ్వర్యంలో కర్నూలులో డ్రగ్స్ వద్దు బ్రో - సైకిల్ తొక్కు బ్రో అనే నినాదంతో ర్యాలీ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా మంత్రి టీజీ భరత్‌తో పాటు పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, ఈగల్ ఎస్పీ నాగేష్‌బాబు హాజరయ్యారు. ఈ ర్యాలీ కొండారెడ్డి బురుజు నుంచి ప్రారంభమై ఎస్వీ కాంప్లెక్స్ మీదుగా జిల్లా పోలీసు కార్యాలయం వరకు సాగింది. సుమారు 400 మంది సైకిల్ తొక్కుతూ డ్రగ్స్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కర్నూలులో డ్రగ్స్ వినియోగం తక్కువగా ఉండటం సంతోషకరమన్నారు. ఎమ్మెల్యే గౌరు చరిత మాట్లాడుతూ డ్రగ్స్ వల్ల జాతీయ సంపదకు నష్టం వాటిల్లుతుందని, యువత భవిష్యత్తు దెబ్బతింటుందని అన్నారు. ఈగల్ ఎస్పీ నాగేష్ బాబు మాట్లడుతూ డ్రగ్స్ నిర్మూలన కార్యక్రమంలో పోలీసు శాఖతో ప్రతి ఒక్కరూ కలిసి పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో హోంగార్డు కమాండెంట్ మహేష్ కుమార్, అడిషనల్ ఎస్పీలు హుసేన్‌పీరా, కృష్ణమోహన్, రెడ్ క్రాస్ జిల్లా ఇన్‌చార్జి గోవిందరెడ్డి, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

భక్తులు అప్రమత్తంగా ఉండాలి

- శ్రీశైల దేవస్థానం ఈవో శ్రీనివాసరావు

శ్రీశైలం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : శ్రీశైల క్షేత్రంలో దళారులను నమ్మి భక్తులు మోసపోవద్దని శ్రీశైల దేవస్థానం ఈవో శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. స్వామిఅమ్మవార్ల ఆర్జిత సేవల్లో పాల్గొనే భక్తులు తమకు కావలసిన ఆర్జిత సేవా టికెట్లను ఆన్‌లైన్‌లో మాత్రమే నమోదు చేసుకోవాలన్నారు. ప్రస్తుతం దేవస్థానం వెబ్‌సైట్‌లో స్వామివారి స్పర్శ దర్శనం టికెట్ మినహా 17 విధాలుగా స్వామిఅమ్మవార్ల ఆర్జిత సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. వసతి గదుల వివరాలు కూడా దేవదాయశాఖ అధికారిక వెబ్‌సైట్, దేవస్థానం నిర్వహించే వెబ్‌సైట్‌ను మాత్రమే వినియోగించాలని సూచించారు. మనమిత్ర వాట్సప్ ద్వారా కూడా శీఘ్ర, అతిశీఘ్ర, స్పర్శ దర్శనాలను పొందవచ్చునని తెలిపారు. ఆన్‌లైన్ బుకింగ్ చేసుకున్నవారు తమ ఆధార్ కాపీలను తప్పనిసరిగా స్కానింగ్ సమయంలో చూపాలన్నారు. శ్రీశైలానికి వచ్చే భక్తులకుఉచిత లడ్డూ ప్రసాదాలు అందించేందుకు సోమవారం 9, 10 కౌంటర్లను సిద్ధం చేసినట్లు తెలిపారు.

అందరూ కలిసి పనిచేయాలి

● కాంగ్రెస్ పార్టీ పరిశీలకుడు యోగేశ్



మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ పరిశీలకుడు

కర్నూలు అర్బన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా ఎవరిని నియమించినా అందరూ కలిసి పనిచేయాలని కాంగ్రెస్ పార్టీ పరిశీలకుడు హెచ్‌సీ యోగేశ్ కోరారు. నగరంలోని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఆదివారం నగర అధ్యక్షుడు షేక్ జిలానీబాషా ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. యోగేశ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని క్షేత్ర స్థాయిలో బలోపేతం చేసేందుకు దేశంలోని అన్ని జిల్లాలకు కొత్త అధ్యక్షులను నియమించాలనే సూచన మేరకు జిల్లాలోని అన్ని నియోజక వర్గాల్లో పర్యటించామన్నారు. కర్నూలు జిల్లాలో పది నెలలుగా జిల్లా అధ్యక్షులు లేరని, కొత్త అధ్యక్షుడిని తీసుకురావడానికి అధిష్ఠానం నిర్ణయించిందన్నారు. ఇది చాలా పెద్ద అవకాశమని, ఆసక్తి ఉన్న ప్రతిఒక్కరూ దరఖాస్తు చేసుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి నాగమధు యాదవ్, మాజీ ఎమ్మెల్సీ సుధాకర్ బాబు, మాజీ డీసీసీ కే. బాబురావు, అనంతరత్నం మాదిగ, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు బతుకన్న, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మహేంద్ర నాయుడు, ఎస్సీ బజారన్న, షేక్ ఖాజా హుస్సేన్, వీరేస్ యాదవ్, దామోదరం రాధాకృష్ణ, సాంబశివుడు, ఈ లాజరస్, సయ్యద్ నవీన్ పాల్గొన్నారు.

ఇద్దరు జేఏవోల బదిలీ

- చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ అనుమతి లేదని అలజడి
- కర్నూలు విద్యుత్‌శాఖలో రహస్య ఉత్తర్వులు

7

ఇద్దరు జేఏవోల బదిలీ



- చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ అనుమతి లేదని అలజడి
- కర్నూలు విద్యుత్‌శాఖలో రహస్య ఉత్తర్వులు
- నిబంధనలకు విరుద్ధంగా బ్యాన్ సమయంలో బదిలీలు
- ఉద్యోగ సంఘాల్లో అసంతృప్తి

కల్లూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కర్నూలు ఏపీ ఎస్‌పీడీసీఎల్ సర్కిల్లో సెప్టెంబరులో ఆకస్మత్తుగా జారీ చేసిన బదిలీ ఉత్తర్వులు కలకలం రేపుతున్నాయి. ఎలాంటి ముందస్తు సూచనలు లేకుండా పరిపాలనాపరమైన కారణాలను సాకుగా చూపిస్తూ ఇద్దరు జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్లను ఒకరినొకరి స్థానంలోకి మార్చుతూ అప్పటి కర్నూలు ఆపరేషన్ సర్కిల్ ఎస్‌ఈ ఉత్తర్వులు జారీచేయడం సంచలనంగా మారింది. కర్నూలు సర్కిల్ లోనే ఉత్తర్వులు అకస్మాత్తుగా రావడంతో ఏం జరిగిందీ, ఎందుకు ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందీ ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల నాయకుల మధ్య జోరుగా చర్చలు సాగుతున్నాయి. పదోన్నతిపై వెళుతున్న సదరు ఉన్నతాధికారి జిల్లాలో ఇష్టారీతిన బదిలీలు, ఆపరేటర్ పోస్టులు, ఉద్యోగులకు ఇచ్చిన శిక్షను తగ్గించేలా నిర్ణయాలు చేశారనే తీవ్ర ఆరోపణలున్నాయి.

ప్రభుత్వం ఆధ్వర్యంలో జనరల్ బదిలీలు

రాష్ట్ర ప్రభుత్వం జీవోఎంఎస్ నెంబరు-23, తేది:15-5-2025న ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించి జనరల్ ట్రాన్స్‌ఫర్లకు అనుమతి ఇచ్చింది. ఈమేరకు పాత నిషేధ ఉత్తర్వులో మినహాయింపుగా 16 మే 2025 నుండి 2 జూన్ 2025 వరకు బదిలీలు చేపట్టడానికి అనుమతి ఇచ్చింది. ఆ ప్రకారం అన్ని శాఖల్లో బదిలీల ప్రక్రియ పూర్తి చేశారు. ఆపై బదిలీలు చేయాల్సి వస్తే ఆ శాఖ ఉన్నతాధికారుల అనుమతితో పరిపాలనా సౌలభ్యం కోసం బదిలీలు చేయాలి.



సీఎండీ రెఫరెన్స్ లేకుండా గత ఎస్‌ఈ ఇచ్చిన జేఏవోల బదిలీ ఆర్డరు

విద్యుత్‌శాఖలో అందుకు విరుద్ధంగా బదిలీలు

విద్యుత్‌శాఖలో నిబంధనలకు విరుద్ధంగా గతంలో కర్నూలు ఎస్‌ఈగా పని చేసిన ఉన్నతాధికారి 12 సెప్టెంబరు 2025లో అర్ధరాత్రి ఆర్డర్లు ఇవ్వడం సంచలనంగా మారింది. ఇష్టారీతిన కర్నూలు సర్కిల్లోని ఇద్దరు జేఏవోలు పి. వెంకటరాఘవను జేఏవో అడ్మినిస్ట్రేషన్ నుంచి ఎంఆర్‌టీ డివిజన్ కర్నూలుకు, ఎం. విజేంద్రచారిని ఎంఆర్‌టీ డివిజన్ నుండి కర్నూలు అడ్మినిస్ట్రేషన్‌కు బ్యాన్(బదిలీల నిషేధం) సమయంలో నిబంధనలకు విరుద్ధంగా బదిలీ ఆర్డర్లు ఇవ్వడంపై అభ్యంతరాలు వచ్చాయి. ఏపీఎస్పీడీసీఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ తిరుపతి కార్యాలయం రెఫరెన్స్(అనుమతి) లేకుండా ఎస్‌ఈ హోదాలో నేరుగా జేఏవోలకు బదిలీ ఉత్తర్వులు ఇచ్చి గోప్యంగా ఉంచడంపై విమర్శలకు కేంద్ర బిందువుగా మారింది. డిస్కం పరిధిలో ఉన్నతాధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

ట్రాన్స్‌ఫర్ పాలసీ మేరకు బదిలీ ఆర్డర్లు



ఉద్యోగుల బదిలీలు ట్రాన్స్‌ఫర్ల పాలసీకి లోబడి చేయాల్సి ఉంటుంది. గైడ్‌లైన్స్‌ను అతిక్రమించి ఆర్డర్లు ఇస్తే ఇతర ఉద్యోగుల నుండి కొంత ఒత్తిడి ఉంటుంది. బ్యాన్ సమయంలో పరిపాలనా సౌలభ్యం కోసం బదిలీలు ఇవ్వవలసి వస్తే తప్పకుండా ఏపీ ఎస్పీడీసీఎల్ (డిస్కం) సీఎండీ, ఉన్నతాదికారుల అనుమతి కచ్చితంగా తీసుకోవాలి.

-ఆర్. ప్రదీప్‌కుమార్, కర్నూలు ఆపరేషన్ సర్కిల్ ఎస్‌ఈ

పదోన్నతిపై వెళుతూ పందేరం

పదోన్నతిపై వెళుతున్న ఆ ఎస్‌ఈ తనకు అనుకూలంగా ఉన్నవారిపై వల్లమాలిన ప్రేమ కురిపించారని ఆరోపణలున్నాయి. ఉద్యోగుల బదిలీలు, ఆపరేటర్ పోస్టులు, విధుల్లో అలసత్వం వహించినందుకు చర్యలు తీసుకున్న ఉద్యోగులకు మేలు చేసేలా నిర్ణయాలు అనేకం చేసినట్లు విమర్శలున్నాయి.

రైలు కిందపడి గుర్తు తెలియని మహిళ బలవన్మరణం

కోవెలకుంట్ల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): రైలు కిందపడి గుర్తుతెలియని మహిళ బలవన ర్మణానికి పాల్పడింది. ఈఘటన కోవెలకుంట్ల రైల్వేస్టేషను పరిధిలో చోటుచేసుకున్నట్లు నం ద్యాల రైల్వే హెడ్‌కానిస్టేబుల్ ఖలీల్ తెలిపారు. వివరాలు.. అమడాల మెట్ట సమీపంలో శనివారం రాత్రి గుర్తుతెలియని మహిళ రైలు కిందపడి మృతి చెందింది. ఈమె వయసు సుమారు 40 నుంచి 45 సంవత్సరాలు ఉంటాయి. నలుపు ఎరుపు గోల్డ్ కలర్ చెక్స్ కలిగిన చీర, జాకెట్, కలిగి ఉందని, ఎత్తు 5 సెంటీమీటర్లు ఉంటుంది. ఈమె రైలు కిందపడి ఆత్మహత్య చేసుకుందా? లేక ఎవరైనా హత్యచేసి ఆత్మహత్యగా చిత్రీకరించారన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నామన్నారు. విషయం తెలుసుకున్న స్థానిక ఏఎస్ఐ నాగరాజు, హెడ్ కానిస్టేబుల్ నాగన్న ఘటనాస్థలికి చేరుకున్నారు. ఎవరైనా ఆచూకీ తెలిసిన వారు 99088 89696 రైల్వే సీఐ నెంబరును సంప్రదించాలని, రైల్వే ఎస్ఐ 8367037525 నెంబర్లకు సంప్రదించాలన్నారు.

ట్రాక్టర్ కిందపడి బాలుడు దుర్మరణం

నెహ్రూనగర్‌లో విషాదం



చేతన్(ఫైల్)

పగిడ్యాల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ కిందపడి 14నెలల బాలుడు దుర్మరణం చెందాడు. ఈ ఘటన మండలంలోని నెహ్రూనగర్‌లో చోటుచేసుకున్నట్లు ముచ్చుమర్రి ఎస్ఐ నరేంద్ర తెలిపారు. వివరాలు.. గ్రామానికి చెందిన గొడుగు శంకరయ్య, లావణ్య లకు చేతన్(14నెలలు) సంతానం. వీరు వ్యవసాయ పనులు చేస్తూ జీవనం సాగిం చేవారు. ఆదివారం ఉదయం తండ్రి పొలం పనులకు వెళ్లగా తల్లి ఇంటి పనుల్లో నిమగ్న మైంది. బాలుడు తమ ఇంటి సమీపంలోని బంధువుల ఇంట్లో ఆడుకునేందుకు వెళ్లాడు. వారి ఇంటికి ఎదురుగా ఉన్న గొడుగు వెంకటేశ్వర్లు అనే వ్యక్తి ఇంటి నిర్మాణం కోసం కర్నూలు నుంచి ఏపీ 21 టీటీ 9588 నెంబరు గల ట్రాక్టర్‌లో సిమెంట్ ఇటుకలను తీసుకొచ్చారు. ఇటుకలను అన్‌లోడింగ్ చేసి వెళ్తుండగా ఆడుకొని ఇంటికి వస్తున్న చేతన్ పై ట్రాక్టర్ వెళ్లింది. బాలుడి తల పగిలి అక్కడికక్కడే మృతిచెందాడు. ట్రాక్టర్ డ్రైవరు ప్రమాదం జరిగిన వెంటనే అక్కడి నుంచి పరారయ్యారు. ఇంట్లో సందడి చేసే ఒక్కగా నొక్క కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు, బంధువుల రోదనలు మిన్నంటాయి. విషషయం తెలుసుకున్న ముచ్చుమర్రి ఎస్ఐ నరేంద్రకు ఘటనాస్థలికి చేరుకొని ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నందికొట్కూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ట్రాక్టర్ డ్రైవరు నిర్లక్ష్యం, అజాగ్రత్తతోనే ప్రమాదం జరిగిందని బాలుడి తల్లి లావణ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. ట్రాక్టర్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అప్పుల బాధతో అన్నదాత ఆత్మహత్య



మద్దయ్య(ఫైల్)

వెల్దుర్తి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలో అప్పుల బాధతో అన్నదాత ఆత్మహత్య చేసుకున్నాడు. వెల్దుర్తి ఎస్ఐ నరేశ్ తెలి పిన వివరాలివీ.. వెల్దుర్తి మండలంలోని కలగొట్ల గ్రామానికి చెందిన మద్దయ్య(55) తనకున్న రెండెకరాల పొలంతో పాటు మాన్యాన్ని కౌలుకు సాగు చేస్తున్నాడు. వ్యవసాయం కోసం సుమారు రూ.6 లక్షలు అప్పు చేశాడు. ఈ సంవత్సరం వేసిన మొక్కజొన్న పంట నష్టం రావడంతో బాగా కుంగిపోయాడు. అప్పులు ఎలా తీర్చాలోనన్న మనస్తాపంతో ఆది వారం ఉదయం ఓ రైతు పొలంలో చెట్టుకు తాడుతో ఉరి వేసున్నాడు. రైతుకు కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. మద్దయ్య భార్య లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన లారీ

ప్యాపిలి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామక్రిష్ణాపురం గ్రామ సమీపంలో ఆదివారం రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఓ లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో పెద్దప్రమాదం తప్పిపోయింది. బెంగుళూరు నుంచి బనగానపల్లి వైపునకు లారీ బయలుదేరింది. మార్గమధ్యలో రామక్రిష్ణాపురం దగ్గరకు రాగానే లారీ అదుపు తప్పి విద్యుత్ స్తం భాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో విద్యుత్ తీగలు తెగి కింద పడ్డాయి. తీగలు తెగిపోవడంతో రాక్రిష్ణాపురం, మాధవరం గ్రామాలకు దాదాపు 3గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ప్రజలు ఇబ్బందులు పడ్డారు. అధికారులు మరమ్మతులు చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. విద్యుత్‌శాఖ ఏఈ వినయ్‌కుమార్ ఫిర్యాదు మేరకు జలదుర్గం పోలీసులు విచారణ చేపట్టారు.

కాంగ్రెస్ బలోపేతం దిశగా ప్రణాళిక

- డీసీసీ అధ్యక్ష పదవికి దరఖాస్తుల ఆహ్వానం
- ఏఐసీసీ పరిశీలకుడు ఎమ్మెల్యే హారీశ్



మాట్లాడుతున్న కర్ణాటక ఎమ్మెల్యే హరీశ్ తదితరులు

నంద్యాల నూనెపల్లి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసే దిశగా చర్యలు చేపడుతున్నామని ఏఐసీసీ పరిశీలకుడు, కర్ణాటక ఎమ్మెల్యే హరీశ్ అన్నారు ఆదివారం నంద్యాలలోని సూరజ్ గ్రాండ్ హోటల్లో డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహ యాదవ్ అధ్యక్షతన నిర్వహించిన విలేకరుల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీశ్ మాట్లాడుతూ యువత, నూతన నాయకత్వాన్ని ప్రోత్సహించేందుకు పార్టీ ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్తం దన్నారు. డీసీసీ పదవుల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామన్నారు. పీసీసీ ఉపాధ్యక్షుడు, రాష్ట్ర పరిశీలకుడు సుధాకర్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా రాష్ట్రాల్లో, జిల్లాల్లో నూతన నాయకత్వాన్ని ఎంపిక చేసుకోవడానికి జిల్లాకు వచ్చామన్నారు. జిల్లాలో హరీష్ క్షేత్రస్థాయిలలో పర్యటించి కాంగ్రెస్ స్థితిగతులను పరిశీలిస్తారన్నారు. డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహ యాదవ్ మాట్లాడుతూ రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజీ కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో ఏఐసీసీ కార్యదర్శి గణేశ్‌యాదవ్, ఏపీసీసీ ప్రధానకార్యదర్శి మూసాని శ్రీనివాసులురెడ్డి, కేకేసీ ఛైర్మన్ కృష్ణారెడ్డి, మాజీ ఏపీసీసీ కార్యదర్శి మోహన్‌రావ్, సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి జయలక్ష్మీ, నంద్యాల అసెంబ్లీకి పోటి చేసిన అభ్యర్థి గోకుల కృష్ణారెడ్డి, పట్టణ అధ్యక్షుడు చింతలయ్యా, ఆళ్లగడ్డ నియోజకవర్గ ఇన్‌చార్జీ హుసేన్‌బాషా పాల్గొన్నారు.

వ్యభిచారం కేసులో ముగ్గురి అరెస్టు

బనగానపల్లె, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): వ్యభిచారం కేసులో ముగ్గురిని అరెస్టు చేసినట్లు సీఐ ప్రవీణ్‌కుమార్ ఆదివారం తెలిపారు. పట్టణంలోని కొండపేటలో షేక్ రోహేన అను మహిళ తన వదిన షేక్ రజియాతో కలసి వ్యభిచారం చేస్తున్నట్లు సమాచారం అందింది. వ్యభిచార గృహంపై మహిళా ఎస్ఐ కల్పన ఆధ్వర్యంలో సిబ్బంది దాడిచేసి రెడ్‌హ్యాండెడ్‌గా ఇరువురు విటులు, ఓ మహిళను అదుపులోకి తీసుకున్నారు. మరో మహిళ రజియా పరారైంది. పట్టుబడ్డ ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

చికిత్స పొందుతూ విద్యార్థిని మృతి

ప్యాపిలి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాధవరం గ్రామంలో గతనెల 28న ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన విద్యార్థిని కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు జలదుర్గం పోలీసులు తెలిపారు. మాధవరం గ్రామానికి చెందిన క్రిష్ణంరాజు, లక్ష్మీదేవి దంపతుల కూతురు హైమావతి(21) కర్నూలులోని ఓ ప్రైవేటు కాలేజీలో డిగ్రీ చదువుతుంది. మూడు రోజుల క్రితం మాధవరానికి విద్యార్థి వచ్చింది. అతల్లిదండ్రులు కూతురుకు పెళ్లి సంబంధాలు చూస్తున్నట్లు తెలిసింది. పెళ్లి ఇష్టం లేదని, చదువు పూర్తి కావాలని చెప్పిన తల్లిదండ్రులు పెడచెవినపెట్టారు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన హైమావతి ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగు మందు తాగింది. కుటుంబ సభ్యులు అపారస్మారక స్థితిలో ఉన్న ఆమెను ని కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక ఆదివారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

నక్సల్స్ కదలికలపై పోలీసుల ఆరా!

- ఎర్రకోన కొండ ప్రాంతాలను పరిశీలించిన పోలీసులు



ఎర్రకోన ప్రాంతంలో పరిశీలిస్తున్న సీఐలు రమేష్‌బాబు, హనుమంతునాయక్

కొలిమిగుండ్ల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎర్రకోన కొండ ప్రాంతాల్లో నక్సల్స్ కదలికలపై స్థానిక పోలీసులు ఆరాతీశారు. కొలిమిగుండ్ల సీఐ రమేష్‌బాబు, కోవెలకుంట్ల సీఐ హనుమంతునాయక్, పలువురు ఎస్ఐలు, స్పెషల్ బ్రాంచ్, ఇంటిలిజెన్స్ అధికారులు, పోలీసులు ఆయా గ్రామాల పరిధిలో పర్యటించారు. ఎర్రకోన కొండ ప్రాంతాల్లోని రైతులను, స్థానికులను కలిసి, సమాచారం సేకరించారు. ఛత్తీస్‌గఢ్ పోలీసులు ఎర్రకోన కొండ ప్రాంతానికి వచ్చి వెళ్లిన విషయాలపైన స్థానికులను కలిసి విచారణ చేపట్టారు. ఈసందర్భంగా కొత్త వారు తిరిగినా, అనుమానాస్పద వ్యక్తులు కనిపించినా పోలీసులకు సమాచారం అందించాలని స్థానికులకు వివరించారు.

ర్యాగింగ్‌పై కలెక్టర్ ఆరా

- విద్యార్థికి ఫోన్ చేసి పరామర్శ
- ధైర్యంగా ఉండాలని సూచన



కర్నూలు అర్బన్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూనివర్సిటీ(ఆర్‌యూ)లో ర్యాగింగ్ పరిణామాలపై కలెక్టర్ సిరి ఆరాతీశారు. బాధిత విద్యార్థికి ఫోన్‌చేసి ధైర్యంగా ఉండాలని సూచించారు. ర్యాగింగ్‌లో దాడులు చేసి సిగరెట్‌తో కాల్చిన సీనియర్ విద్యార్థిపై వర్సిటీ అధికారులు కేవలం హాస్టల్ నుంచి సస్పెండ్ చేసి చేతులు దులిపేసుకున్నారు. అతడు యథావిధిగా తరగతులకు హాజరవుతుండటంతో బాధిత విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. దాడులకు పాల్పడిన విద్యార్థి కుల సంఘాల నాయకులను వెంటబెట్టుకుని క్యాంపస్‌లో మరోసారి బెదిరింపులకు పాల్పడం ఎంతవరకు సమంజసమని కొందరు విద్యార్థి నాయకులు మండి పడుతున్నారు. వర్సిటీకి చెందిన ఓ అధికారి, ఓ విద్యార్థి నేత దాడులకు పాల్పడిన విద్యార్థికి అండగా నిలవడంతో పాటు కుల సంఘాలను రెచ్చగొడుతూ క్యాంపస్‌లో అలజడి సృష్టించడమేమిటని కొందరు విద్యార్థులు ప్రశ్నిస్తున్నారు.

రిజిస్ట్రార్‌ను తొలగించాలి

రిజిస్ట్రార్‌ను తొలగించే వరకు పోరాటం ఆగదు. విద్యార్థులు, ప్రొఫెసర్ల మధ్య ఆధిపత్య పోరుకు కారణంమైన వ్యక్తిని ఉపకులపతి వెనుకేసు రావడం ఏమిటి? ర్యాగింగ్ పై చర్యలు తీసుకుంటే కుల సంఘాలను వర్సిటీలోకి పిలిపించి ఆందోళనలు చేపట్టడం ఎంత వరకు సమంజసం. పరిష్కరించాల్సిన అధికారులే సమస్యలకు అజ్యం పోయడం కరెక్టు కాదు.

-ఎస్ శరత్‌కుమార్,. జిల్లా సహాయ కార్యదర్శి ఏఐఎస్ఎఫ్

రిజిస్ట్రార్‌కు వ్యతిరేకంగా ఆందోళనలు

క్యాంపస్‌లో రిజిస్ట్రార్‌కు వ్యతిరేకంగా ఆందోళనలు జరుగుతున్న విషయం తెలిసిందే. బీఈడీ కళాశాలల జిల్లాలో 49 ఉన్నాయి. అందులో భవనాలు లేకపోయినా14 కళాశాలలకు అనుమతులు ఎలా ఇస్తారంటూ ఆందోళనలు ఉధృతం చేసిన క్రమంలో విద్యార్థుల ర్యాగింగ్ కలకలం ఒక్కసారిగా వెలుగులోకి రావడంపై విద్యార్థి సంఘాల నాయకులు అనుమానాలు వ్యక్తంచేస్తున్నారు. విషయాన్ని పక్కదారి పట్టించేందుకు ఇలాంటి ఘనటలు తెరపైకి తెచ్చి విద్యార్థుల భవిష్యత్ తో అడకుంటారంటూ మండి పడుతున్నారు. రిజిస్ట్రార్, కొందరు ప్రొఫెసర్ల మధ్య జరుగుతున్న ఆధిపత్య పోరులో విద్యార్థులను బలితీయడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. తాజా వరుస పరిణామాలను ఉన్నత విద్యా మండలికి కలెక్టర్ నివేదిక పంపడం.. ఆ నివేదికల ఆధారంగా సదరు వర్సిటీ ఉన్నతాధికారులను ఉన్నత విద్యామండలి మందలించనట్లు ప్రొఫెసర్లు చెబుతున్నారు.

చర్యలు తీసుకున్నాం

విషయం కలెక్టర్ దృష్టికి వెళ్లిన మాట వాస్తవమే. ర్యాగింగ్ జరిగిందని చర్యలు తీసుకున్నాం. మరి కొందరు సస్పెన్షన్‌ఎత్తివేయాలని కోరడం ఎంత వరకు సమంజసం.

- వెంకట బసవరావు, ఉపకులపతి, ఆర్‌యూ

కలెక్టర్ ఫోన్ చేశారు

కలెక్టర్ ఫోన్‌చేశారు. మరోసారి పునరావృతమైతే నాదృష్టికి తీసుకురమ్మనారు.. జరిగిన సంఘటన అంతా అడిగి తెలుసుకున్నారు. జరిగిన ప్రతి అంశాన్ని కలెక్టర్‌కు వివరించాను.

- హరీశ్, బీఎస్సీ(ఫస్టియర్), ఆర్‌యూ

జాబ్ మేళాను వినియోగించుకోండి

పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్



పోస్టరును ఆవిష్కరిస్తున్న మంత్రి భరత్

కర్నూలు అర్బన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఈనెల 8న నిర్వహించే జాబ్ మేళాను యువత సద్వినియోగించుకోవాలని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. ఆదివారం నగరంలోని తన కార్యాలయంలో కేవీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే జాబ్ మేళా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీ మేరకు 20 లక్షల ఉద్యోగాల కల్పనలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగ నియామకంతో పాటు మెగా జాబ్‌మేళాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దాదాపు 1350 ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని, యువత హాజరయి ఉద్యోగాలు పొందాలని కోరారు.

'సైక్ సిద్ధార్థ్' నటీనటుల సందడి

సీమ ప్రేక్షకుల ప్రేమ గొప్పది : నందు



కొండారెడ్డి బురుజు వద్ద నందు, యామిని

కర్నూలు కల్చరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కర్నులు నగరంలోని కొండారెడ్డి బురుజు వద్ద సైక్ సిద్దార్థ్ హీరో హీరోయిన్లు నందు, యామినీ భాస్కర్ సందడి చేశారు. డిసెంబరు 12న ఆ చిత్రం విడుదల సందర్భంగా చిత్రం ప్రమోషన్‌లో భాగంగా ఆదివారం వారు కర్నూలు విచ్చేశారు. ఈ సందర్భంగా కొండారెడ్డి బురుజు వద్ద నందు అభిమానులతో సందడి నెలకొంది. హీరో హీరోయిన్లతో సెల్ఫీలు దిగేందుకు అభిమానులు ఉత్సాహం చూపారు. అభిమానులతో హీరో నందు, హీరోయిన్ యామినీ భాస్కర్ సరదాగా ముచ్చటించారు. అనంతరం కిడ్స్ వరల్డ్ సమీపంలోని వెంకటేశ్ థియేటర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హీరో నందు మాట్లాడుతూ తాను నిర్మాతగా, సహ నిర్మాతగా దగ్గుబాటి రాణా ఈ చిత్రం నిర్మించామని తెలిపారు. సురేష్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై చిత్రం పూర్తి చేశామని తెలిపారు. చిత్రం హీరోయిన్ యామినీ భాస్కర్ మాట్లాడుతూ చక్కని కుటుంబ కథతోపాటు యువత మధ్య ప్రేమను కొత్తగా చూపారని తెలిపారు.

ప్రాచీన కళారూపాలను కాపాడుకోవాలి

- ఆర్‌యూ, క్లస్టర్ యూనివర్సిటీ వీసీ ఆచార్య వెంకట బసవరావు
- ఘనంగా 'దండెబోయిన బాలరంగయ్య-పాపులమ్మ' స్మారక పురస్కారోత్సవం



'దండెబోయిన' పురస్కారాన్ని సింధే రామమూర్తి దంపతులకు అందజేస్తున్న నిర్వాహకులు

కర్నూలు కల్చరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రాచీన కళారూపాలను కాపాడుకోవాలని రాయలసీమ యూనివర్సిటీ, క్లస్టర్ యూనివర్సిటీల వీసీ ఆచార్య వి. వెంకట బసవరావు అన్నారు. ఆదివారం నగరంలోని బి. క్యాంపులోగల ప్రభుత్వ ఉన్నత విద్యా అధ్యయన సంస్థ (ప్రభుత్వ బీఎడ్ కళాశాల)లో దివంగత దండెబోయిన బాలరంగయ్య-పాపులమ్మ స్మారక పురస్కార ప్రదానోత్సవం జరిగింది. సాహితీ సదస్సు, నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం (నరసం), తెలుగు భాషా వికాస ఉద్యమం సంస్థ, ప్రభుత్వ బీఎడ్ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వీసీ వెంకట బసవరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాచీన కళారూపాల్లో ఒకటైన తోలు బొమ్మలాట కళాకారులను గుర్తించి, వారికి ఈ పురస్కారం అందజేయడం అభినందనీమని చెప్పారు. క్లస్టర్ వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ జి. శ్రీనివాస్ మాట్లాడుతూ కర్నూలు జిల్లాలో కళలకు, సాహిత్యానికి గుర్తింపు ఉందని కొనియాడారు. సభాధ్యక్షత వహించిన బీఎడ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆదినారాయణ రెడ్డి మాట్లాడుతూ తెరచాటుకు మరలిపోతున్న కళారూపాలను కాపాడుకోవాల్సిన బాధ్యత భవిష్యత్తు తరాలపై ఉందని చెప్పారు. . ఈ సమావేశంలో బీఎడ్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె. మధుసూదన్, అఖిల భారత బ్రాహ్మణ కరివేన నిత్యాన్నదాన సత్రం కార్యదర్శి డాక్టర్ వేణుగోపాల్, కోఆర్డినేటర్ హెచ్‌కే మనోహర్‌రావు తదితరులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి జిల్లా, లేపాక్షికి చెందిన సింధే రామమూర్తి, సావిత్రమ్మ దంపతులకు దండెబోయిన పురస్కారాన్ని డాక్టర్ దండెబోయిన పార్వతీదేవి, లక్ష్మయ్య, దండెబోయిన రమేష్ అందించి సన్మానించారు.

అలరించిన తోలుబొమ్మలాట ప్రదర్శన..

ఈ కార్యక్రమంలో భాగంగా సింధే రామమూర్తి బృందం ప్రదర్శించిన అత్యంత ప్రాచీన జానపద కళారూపం తోలు బొమ్మలాట అసాంతం ఆకట్టుకుంది. రామాయణ మహాకావ్యంలోని కిష్కింద కాండలోని హనుమంతుని లంకా పయనం ఘట్టాన్ని ఆద్యంత ఆకట్టుకునేలా కళాకారులు ప్రదర్శించారు.

దివ్యాంగులు వచ్చేదెలా?



మండల పరిషత్ కార్యాలయం వెనుక డోరు ద్వారా వృద్ధులు, దివ్యాంగులు లోపలికి వచ్చేవారు. అయితే దారికి అడ్డంగా గ్రావెల్ వేయడంతో దివ్యాంగులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజాఫిర్యాదుల కార్యాక్రమాలకు రావాలంటే ఇబ్బందిగా ఉందని దివ్యాంగులు, వృద్ధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి, మట్టిని తొలగించాలని కోరుతున్నారు. ఈవిషయమై ఎంపీడీవో రాణెమ్మను వివరణ కోరగా మొక్కలు నాటేందుకు తెచ్చామని వెంటనే తొలగిస్తామన్నారు. - సి.బెళగల్

రోడ్డు సిద్ధం.. బస్సేదీ?



మండల కేంద్రం నుంచి చనుగొండ్ల మీదుగా కోడుమూరు వరకు 10 కి.మీల బీటీ రోడ్డు నిర్మించారు. అయితే తమ గ్రామాలకు బస్సులు తిప్పడం లేదని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. గతంలో బస్సు తిరిగేది, రహదారి బాగాలేదని ఆర్టీసీ అధికారులు బస్సును రద్దుచేశారు. కాగా అయిదు నెలల క్రితం నూతనంగా బీటీ రోడ్డు నిర్మించారు. దాదాపు వందల సంఖ్యలో ప్రయాణికులు, రైతులు కోడుమూరుకు రాకపోకలు సాగిస్తుంటారు. బస్సు సర్వీసు లేకపోవడంతో అవస్థలు పడుతున్నారు. - గూడూరు

బీపీఎస్ అమలుకు స్పెషల్ డ్రైవ్

● నగర పాలక సంస్థ కమిషనర్ విశ్వనాథ్



కర్నూలు న్యూసిటీ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): నగరంలో అనుమతి లేకి భవన నిర్మాణాల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం విడుదల చేసిన బీపీఎస్‌పై అవగాహన కల్పించేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు కమిషనర్ పి.విశ్వనాథ్ తెలిపారు. ఆదివారం పట్టణ ప్రణాళిక అధికారులు, ప్లానింగ్ కార్యదర్శులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. సోమవారం నుంచి ప్రతి సచివాలయ పరిధిలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలన్నారు. ఎల్ఆర్ఎస్ పథకానికి సంబంధించి ఈ సంవత్సరం జూన్ 20 లోపు ఉన్న అనధికార లేఅవుట్లు, ప్లాట్లకు మాత్రమే క్రమబద్ధీకరణకు అవకాశం ఉందని కమిషనర్ తెలిపారు.

ఉద్యోగాలు, ఉపాధి కోసం ఉద్యమించాలి



మాసపత్రికను ఆవిష్కరిస్తున్న లెనిన్‌బాబు

కర్నూలు న్యూసిటీ, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ఉద్యోగాలు, ఉపాధి కోసం ఉద్యమించాలని ఏఐవైఎఫ్ నాయకుడు లెనిన్‌బాబు పిలుపునిచ్చారు. ఆదివారం సీఆర్ భవన్‌లో యువజన మాస పత్రికను ఆర్గనైజింగ్ కార్యదర్శి సంతోష్‌కుమార్‌తో కలిసి ఆవిష్కరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో పూర్తిగా విఫలమయ్యాయన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం యువతకు ఉద్యోగావకాశాలు కల్పించకుండ మతం పేరుతో రాజకీయాలు చేస్తూ కాలం గడుపుతుందని ఆరోపించారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీ పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వకపోగా, ప్రభుత్వ రంగ సంస్థలను సైతం అంబానీ, ఆదానీలకు కట్టబెడుతూ నిరుద్యోగాన్ని పెంచి పోషిస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో నాగరాముడు, కె.శ్రీనివాసులు, శ్రీరాములు, రామక్రిష్ణ, ప్రభాకర్, చెక్కలి వెంకటేష్, రాజశేఖర్, రాజు, రమేష్ పాల్గొన్నారు

గడ్డివామి దగ్ధం



దగ్ధమైన గడ్డివామి

కోడుమూరు రూరల్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్లరి గ్రామంలో గడ్డివామి దగ్ధమైంది. బాధితుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన రైతు వీరేశ్ తన ఇంటికి ఆనుకుని ఉన్న కల్లందొడ్డిలో సుమారు 4 బండ్ల గ్రాసాన్ని గడ్డివామిగా ఏర్పాటు చేసుకున్నారు. శనివారం అర్ధరాత్రి దాటాక మంటలు వ్యాపించాయి. ఎద్దుల అరుపులు విని నిద్రలేచిన ఇంట్లో నిద్రిస్తున్న రైతు కుటుంబ సభ్యులు కట్టి ఉంచిన ఎద్దులను తప్పించడంతో ప్రాణాలతో బయటపడ్డాయి. ఇరుగుపొరుగువారితో కలిసి మంటలార్పారు. పశుగ్రాసం కాలిపోయిందని ప్రభుత్వం తనను ఆదుకోవాలని రైతు కోరుతున్నారు.

ముగిసిన ఎన్ఎంఎంఎస్ మోడల్ పరీక్ష



పరీక్ష పత్రాన్ని విడుదల చేస్తున్న హెచ్ఎం, డిప్యూటీ ఈవో

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఎస్ఏపీ క్యాంపు కట్టమంచి రామలింగారెడ్డి స్మారక నగర ఉన్నత పాఠశాలలో ఆదివారం ఎన్ఎంఎంఎస్ మోడల్ పరీక్ష నిర్వహించారు. హెచ్ఎం వెంకటరెడ్డి, డిప్యూటీ ఈవో శ్రీధర్ బాబు పరీక్షా పత్రాలను విడుదల చేశారు. పరీక్షకు నగరంలోని వివిధ పాఠశాలలకు చెందిన 08 మంది విద్యార్థులు హాజరయ్యాని తెలిపారు. అర్బన్ ఎంఈవో అబ్దుల్ రెహిమాన్, పాఠశాల హెచ్ఎంసీ ఛైర్మన్ కుమార్, సబ్జెక్టు నిపుణులు అర గోపాల్, నిమ్మ కుమార్, ఆర్. కృష్ణమోహన్, లక్ష్మీనరసయ్య పాల్గొన్నారు.

బహిరంగంగా తాగితే జైలుకే

సి.బెళగల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే జైలు తప్పదని ఎస్ఐ వేణుగోపాల్‌రాజు హెచ్చరించారు. ఆదివారం కంబందహాల్, చింతమానుపల్లె, ఇనగండ్ల అడ్డరోడ్డు, పోలకల్లు గ్రామాల రహదారులను పరిశీలించారు. రహదారుల పక్కన మద్యం సేవించరాదని దుకాణాల్లో గంజాయి, గుట్కా విక్రయిస్తే సీజ్ చేస్తామన్నారు.

క్యాన్సర్ నివారణ మన చేతుల్లోనే



ర్యాలీలో పాల్గొన్న డా. వాసురెడ్డి, రోటరీ క్లబ్ సభ్యులు

కర్నూలు హస్పిటల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్ నివారణ మన చేతుల్లో ఉందని, జీవనశైలిని మార్చుకోవాలని రోటరీ క్లబ్ ఆఫ్ గ్రేటర్ కర్నూలు జిల్లా కార్యదర్శి, సర్జికల్ అంకాలజిస్టు డా.సి.వాసురెడ్డి అన్నారు. ఆదివారం ఉదయం రోటరీ , ఇన్నర్‌వీల్ క్లబ్ ఆధ్వర్యంలో రాజ్‌విహార్ నుంచి కలెక్టరేట్ వరకు 'క్యాన్సర్ అవగాహన కొరకు నడక' నిర్వహించారు. సాగింది. ప్రతి ఒక్కరూ వయసుతో నిమిత్తంం లేకుండా వ్యాక్సిన్ వేయించుకోవాలన్నారు. ఆహారంలో పండ్లను భాగం చేసుకోవాలని, ఒత్తిడికి లోను రాకూడదని, శారీరక శ్రమ ఉండాలన్నారు. క్యాన్సర్‌ను ప్రారంభదశలో గుర్తించి చికిత్స అందిస్తే నయం చేయవచ్చునన్నారు. రోజూ ఉదయం 45 నిమిషాలు వ్యాయామం, నడకను అలవచుకోవాలన్నారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు ప్రసాద గుప్తా, మాజీ అసిస్టెంట్ గవర్నర్ టీఎస్ విజయ్‌కుమార్, వైస్ ప్రెసిడెంట్ అనిల్ కుమార్, డీఎల్ఎస్ ప్రకాష్‌రావు, నూగూరు వెంకటేశ్వర్లు, లీగల్ సర్వీసెస్ సభ్యుగు డా.రాయపాటి శ్రీనివాస్ ఉన్నారు.

సృజనాత్మకత పెంచేందుకే పోటీలు

● పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

కర్నూలు కల్చరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకే పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. ఆదివారం నగరంలోని సి.క్యాంపు టీటీడీ కల్యాణ మంటపంలో, టీటీడీ, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో భగవద్గీత పోటీలకు ముఖ్య అతిధిగా విచ్చేశారు. టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి జిల్లా కార్య నిర్వాహకుడు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 75 మంది పాల్గొన్నారన్నారు. న్యాయ నిర్ణేతలుగా సాహితీవేత్తలు డాక్టర్ తొగట సురేష్‌బాబు, ఎస్ వరలక్ష్మి, సువర్ణ జోషి, పసుపులేటి నీలిమ, బి.మురళీధర్, జి.వనజకుమారి, డాక్టర్ దేవి దయానంద్ సింగ్, ఎస్ భానోజీ రావు, ఎల్ శిరీష వ్యవహరించారు. కల్యాణ మంటపం మేనేజర్ రామ్మోహన్‌రెడ్డి, కృష్ణప్రసాద్, ముద్రిక భాస్కర్ పాల్గొన్నారు.

పడిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే

కల్లూరు: నగరంలోని 41వ వార్డు వీకర్ సెక్షన్ కాలనీలో టీడీపీ ఇన్‌చార్జ్ రాఘవేంద్ర నివాసంలో పడిపూజల్లో ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి పాల్గొన్నారు. హరి నారాయణ గురుస్వామి ఆధ్వర్యంలో అభిషేకం, పూజలు చేశారు. విశ్వ బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ పార్వతమ్మ, యువ నాయకుడు గౌరు జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.

14,15 తేదీల్లో సీపీఐ మహాసభలు



మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి జగన్నాథం

కర్నూలు న్యూసిటీ, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ఈ నెల 14,15 తేదీల్లో నగరంలో సీపీఐ 17వ నగర మహాసభలను నిర్వహిస్తున్నట్లు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కే.జగన్నాథం తెలిపారు. ఆదివారం సీఆర్ భవన్‌లో మాట్లాడుతూ డిసెంబర్ 26 నాటికి ఈ దేశంలో సీపీఐ వందేళ్ళు పూర్తి చేసకుఉందన్నారు. 1925 డిసెంబర్ 26న కాన్పూర్ నగరంలో ఆవిర్భవించిందని, నాటి నుంచే స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొందన్నారు. కేంద్ర ప్రభుత్వం 44 కార్మిక చట్టాలన నాలుగు లేబర్ కోడ్లుగా విభజించి కార్మికులను ఇబ్బందులు పెడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. నగరంలో హైకోర్టు బెంచి ఏర్పాటుకు ఏబీసీ క్యాంపుల క్వార్టర్స్‌ను ఖాళీ చేయించడం సరికాదని విమర్శించారు. జగన్నాథ గట్టులో ఉన్న ఇందిరమ్మ గృహలు టిడ్కో గృహలను తక్షణమే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పి.రామక్రిష్ణారెడ్డి, డి.శ్రీనివాసరావు, సి.మహేష్, నాగరాజు, వెంకటేష్, కుమార్, అన్వర్ పాల్గొన్నారు.

నేడు ఫిర్యాదుల స్వీకరణ

కర్నూలు న్యూసిటీ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు కమిషనర్ విశ్వనాథ్ ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎస్‌బీఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగర పాలక సమావేశ భవనంలో ఉదయం 10.30 గంటలకు అర్జీలు స్వీకరిస్తామన్నారు. నగర పాలక సంస్థకు చెందిన అన్ని విభాగాల అధికారులు హాజరవుతారని, సమస్యలన లిఖిత పూర్వకంగా సమరిపంచాలన్నారు. ఫిర్యాదుల పురోగతిని ప్రజలు స్వయగా https://Meekosam.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవచ్చని వివరించారు.

ఆప్టా రాష్ట్ర అధ్యక్షుడిగా ప్రకాష్ రావు

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన కాకి



ప్రకాష్ రావు ఏపీ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎంపిక య్యారు. ఆదివారం మచిలీపట్నంలో తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఎస్‌జీటీలకు శాసనమండలి ఎన్నికల్లో ఓటుహక్కు కల్పించాలని, పీఎస్ హెచ్ఎంలుగా సెకండరీ గ్రేడ్ టీచర్లనే నియమిం చాలని డిమాండ్ చేశారు. అలాగే 1 నుంచి 10వ తరగతి ఉండే ఉన్నత పాఠశాలల నుంచి ప్రాథమిక పాఠశాలలను వేరుచేసి ఏర్పాటు చేయాలని కోరారు.

మార్షల్ ఆర్ట్సను సాధన చేయాలి

● మార్కెట్ యార్డు మాజీ చైర్‌పర్సన్ శమంతకమణి



తైక్వాండో క్రీడను ప్రారంభిస్తున్న అతిథులు

కర్నూలు స్పోర్ట్స్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆత్మరక్షణకు ప్రతి విద్యార్థి మార్షల్ ఆర్ట్సను సాధన చేయాలని మార్కెట్ యార్డు మాజీ చైర్‌పర్సన్ ఎన్.శమంతకమణి అన్నారు. ఆదివారం స్థానిక కిడ్స్ వరల్డ్ పార్కులో తైక్వాండో శిక్షణ పొందుతున్న క్రీడాకారులకు పరికరాలు, శిక్షణ పూర్తిచేసుకున్న వారికి ఎల్లో, గ్రీన్ బెల్టులు అందజేశారు. స్పోర్ట్స్ అథారిటీలో ఉన్న క్రీడలని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు ఆత్మరక్షణకు బాక్సింగ్, తైక్వాండో, జూడో క్రీడల్లో శిక్షణ ఇప్పించాలని కోరారు. వగరూరు సుబ్రహ్మణ్యం చారిటబుల్ ట్రస్టు వారు బెల్టులను అందించారు. ఈ కార్యక్రమంలో తైక్వాండో సీనియర్ శిక్షకుడు టి.వెంకటేశ్వర్లు, కోచ్ టి.అజయ్, బాక్సింగ్ కోచ్ ఆర్.మదు కుమార్ జూడో కోచ్ కే.నవీన్, లలిత, టి.తిలక్, అఖిల్, సాయిక్రిష్ణ పాల్గొన్నారు.

వాగును ఆక్రమించి తప్పుడు ప్రచారం..

● కర్నూలు రూరల్ తహసీల్దార్ రమేష్‌బాబు

కర్నూలు రూరల్ నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): రూరల్ మండలం భూపాల్‌నగర్‌కు చెందిన ఈడిగ రవిశంకర్ గౌడ్ అనేవ్యక్తి వాగు పరంపోగు పొలాన్ని ఆక్రమించి తనపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని తహసీల్దార్ టి.వెంకటరమేష్ బాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నీటి ప్రవాహాన్ని అడ్డుకుంటున్నారని ఆరోపించారు. అక్రమణ తొలగించేందకు చర్యలు తీసుకుంటున్నందుకు కొన్ని ఛానళ్లలో తనపై ఆరోపణలు చేస్తున్నాడని తహసీల్దార్ వివరించారు. కార్యాలయ ఆవరణలో చోటుచేసుకున్న గొడవకు తనకు సంబంధం లేదని వివరించారు.

విద్యార్థికి అభినందన



విద్యార్థిని అభినందిస్తున్న హెచ్ఎం నాగలక్ష్మి, ఉపాధ్యాయులు

కర్నూలు కల్చరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన 'మాక్ అసెంబ్లీ'లో పాల్గొన్న కోడుమూరు జడ్పీ హెచ్ పాఠశాల విద్యార్థి కె.లోకేశ్వర రెడ్డిని హెచ్ఎం ఎం.నాగలక్ష్మి, ఉపాధ్యాయులు అభినందించారు. ఆదివారం పాఠశాల్లో ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమంలో మాట్లాడుతూ మాక్ అసెంబ్లీకి జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించాడన్నారు. ఉపాధ్యాయుల మార్గదర్శకత్వంలో, రూపొందించిన ప్రసంగంతో విద్యార్థి అత్యుత్తమ ప్రదర్శన ఇచ్చాడన్నారు.

రోడ్డు మీదే మురుగు

● అవస్థలు పడుతున్న మజరా గ్రామాల ప్రజలు



క్రిష్ణదొడ్డి గ్రామంలో రోడ్డు దుస్థితి

సి.బెళగల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో మురుగు రోడ్లమీదే ప్రవహిస్తోంది. క్రిష్ణదొడ్డి, బ్యాదోలి గ్రామాలు బురాన్‌దొడ్డి గ్రామ పంచాయతీలలోని మజరా గ్రామాల ప్రజలు అవస్థలు పడుతున్నారు సీసీ రోడ్లు, మురుగు కాలువలు, తాగునీరు, వీధి దీపాలు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. సీసీ రోడ్లు, డ్రైనేజీ లేకపోవడంతో మురుగు నీరంతా రోడ్డుపైకి వస్తోంది. అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

టీడీపీ కార్యకర్త పాడె మోసిన ఎంపీ



అంతిమయాత్రలో పాల్గొన్న కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు

కర్నూలు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): రూరల్ మండలంల పంచలింగాల గ్రామంలో టీడీపీ కార్యకర్త నందీశ్వరరెడ్డి అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. సాయంత్రం మృతుడి అంతిమ సంస్కారాలు నిర్వహించారు. ఎంపీ బస్తిపాటి నాగరాజు మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం అంతిమ యాత్రలో టీడీపీ కార్యకర్త పాడెను స్వయంగా ఎంపీ మోశారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి



డీఈవో శామ్యూల్‌పాల్‌కు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని డీటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు ఆదివారం డీఈవో శామ్యూల్ పాల్‌కు జిల్లా ప్రధాన కార్యదర్శి గట్టు తిమ్మప్ప, రాష్ట్ర కార్య వర్గ సభ్యులు రత్నం ఏసేపు వినతిపత్రం ఇచ్చారు. కప్పట్రాళ్ల ఉన్నత పాఠశాలకు అదనంగా 5 ఐఎఫ్‌పీ ప్యానెల్‌ను కేటాయించాలని కోరారు. ఉత్తర్వులు పొందిన టీచర్లందరినీ రిలీవ్‌తో సంబంధం లేకుండా బదిలీ చేయాలన్నారు. వేయి మంది విద్యార్థులున్న గోనెగండ్ల, తెర్నేకల్ ఉన్నత పాఠశాలలను విభజించాలన్నారు. 1 నుంచి 10వ తరగతుల వరకు ఒకే ప్రాంగణంలో నడుపుతున్నందున ఇబ్బందులు వస్తున్నాయన్నారు. 1,700 మంది విద్యార్థులకు ఒకరే హిందీ పండిట్ ఉన్నారనీ, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. రోశన్న, ముద్దు, రంగప్ప, సుబ్బరాయుడు ఉన్నారు.

కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న సీఐటీయూ, కార్మిక సంఘం నాయకులు

కర్నూలు న్యూసిటీ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని ఆ సంఘం ఓల్డ్ సిటీ అధ్యక్షుడు సి.నాగరాజు డిమాండ్ చేశారు. ఆదివారం జోహరాపురంలో సీఐటీయూ నాయకుడు ఆర్.రమణ అధ్యక్షతన నిరసన తెలిపారు. భవన నిర్మాణ కార్మికులు పోరాటాలు యూపీఏ-1 ప్రభుత్వంలో సంక్షేమ బోర్డును సాధించుకున్నారన్నారు. విభజన అనంతరం అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం రాజధాని అభివృద్ధి పేరుతో కార్మికుల సొమ్మును వాడుకుందన్నారు. కార్మికులు టి.మధు, టి.మద్దిలేటి, జి.మౌలాలి, ఎస్.లక్ష్మన్న, అబ్దుల్లా బహదూర్ లాజర్ మాలిక్, నాగరాజు, కృష్ణ, మహబూబ్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి పురస్కారం



పురస్కారం అందుకుంటున్న వెంకటేశ్వర్లు

సి.బెళగల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బురాన్‌దొడ్డి గ్రామానికి చెందిన తెలుగు ఉపాధ్యాయుడు టి.వెంకటేశ్వర్లు పురస్కారం అందుకున్నారు. ఆదివారం అనంతపురం పట్టణంలోని వేమల అభివృద్ధి కేంద్రంలో సాంస్కృతిక వేదిక నిర్వహించిన కార్యక్రమంలో రాయలసీమ సమన్వయకర్త డాక్టర్ అప్పిరెడ్డి, హరినాథరెడ్డి, మాజీ వైస్‌చాన్స్‌లర్ ఆచార్య రామకృష్ణారెడ్డి చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని అందుకున్నట్లు తెలిపారు. 180మంది కవులు పాల్గొనగా వచ్చే నెల సప్తనదుల సంగమేశ్వరం శీర్షికపై నిర్వహించనున్న కార్యక్రమానికి ఎంపికైనట్లు వెంకటేశ్వర్లు తెలిపారు.

డిప్యూటీ ఎంపీడీవోగా పదోన్నతి



జాకీర్ హుసేన్‌తో ఉద్యోగులు

కల్లూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ షేక్ జాకీర్‌హుసేన్ డిప్యూటీ ఎంపిడిఓగా పదోన్నతి పొందారు. మండల జీఎస్‌డబ్ల్యూఎస్ అధికారిగా (సూపర్‌వైజర్‌గా) బాధ్యతలు స్వీకరించారు. ఎంపీడీవో జి.నాగశేషాచలరెడ్డి, డిప్యూటీ ఎంపీడీవో నాగేష్, ఏవోనాగరాజు తడకనపల్లె సెక్రటరి షేక్షావలి అభినందనలు తెలిపారు.

ఎస్ఐకి సన్మానం



ఎస్ఐను సన్మానిస్తున్న పోలీసు అధికారులు

కర్నూలు క్రైం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పోలీసు శాఖలో ఎస్ఐగా పని చేస్తూ పదవీ విరమణ పొందిన విజయభాస్కర్‌ను ఆదివారం పోలీసు అధికారులు సన్మానించారు. కర్నూలు కమ్యూనికేషన్ విభాగంలోలో పని చేస్తున్న విజయభాస్కర్ పదవీ విరమణ పొందారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఏఎస్పీ హుశేన్‌పీరా, అధికారులు సన్మానించారు. డీసీఆర్‌బీ సీఐ గుణ శేఖర్, ఎస్ఐలు సోమ్లా నాయక్, మల్లేశ్వరి పాల్గొన్నారు.

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్

కర్నూలు క్రైం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతకు విఘాతం కలిగించవద్దని రౌడీషీటర్లను పోలీసులు హెచ్చరించారు. ఎస్పీ ఆదేశాల మేరకు ఆదివారం జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో కౌన్సెలింగ్ ఇచ్చారు. రౌడీషీటర్లు, నేర చరిత్ర గలవారికి చెడు నడత గలవారిని పోలీస్ స్టేషన్లకు పిలిపించి సీఐలు, ఎస్ఐలు ఆదివారం కౌన్సెలింగ్ ఇచ్చారు. సత్ప్రవర్తనతో మెలగాలని, నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలన్నారు.

జనసేనలో చేరిక

కోడుమూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సుందరయ్య నగర్‌కు చెందిన ఎ.రాముడుతో సహా మరో 300మంది తెలుగుదేశం పార్టీని వీడి ఆదివారం జనసేనలో చేరారు. జనసేన పార్టీ నాయకుడు సంధ్య విక్రమ్‌కుమార్ వీరికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అధినేత పవన్ కళ్యాణ్ సూచనల మేరకు రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థులను గెలిపించాలని కోరారు. జనసేన నాయకులు బాలకృష్ణగౌడ్, షాలుబాషా, క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన నాయకులు

నేడు ఎద్దులదొడ్డికి ఎమ్మెల్యే రాక

తుగ్గలి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీకి సోమవారం ఎద్దులదొడ్డికి వస్తున్నట్లు టీడీపీ నాయకులు శ్రీనివాసులు గౌడు, సర్పంచ్ విజయ్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కోసం ఉదయం 10 గంటలకు ఎద్దులదొడ్డికి వచ్చి పింఛన్లు పంపిణీ చేస్తారని అన్నారు.

రేపటి నుంచి రంగస్వామి ఉత్సవాలు



పూజలందుకుంటున్న నవగ్రహ దేవతామూర్తులు

తుగ్గలి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): భక్తుల ఆరాధ్య దైవం శ్రీ గౌతమి మహాముని రంగస్వామి ఉత్సవాలు డిసెంబరు 2 నుంచి ప్రారంభం అవుతాయి. ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన నవగ్రహ దేవతా మూర్తులు. ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు భారీగా తరలిరానున్నారు. వివరాల్లోకి వెళితే మండలంలోని లింగనాయునదొడ్డి గ్రామంలో గౌతమ మహాముని కొండల్లో వెలసిన మహాముని రంగస్వామికి అవధూత పీఠాధిపతి ఫక్కీరప్ప స్వాములు స్వామివారికి ప్రత్యేక పూజలు చేస్తూ ఆలయ అభివృద్ధి కోసం ఎంతో కృషి చేశారన్నారు. ప్రతి ఏటా జాతర ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. ఈ ఉత్సవాలకు ఇతర ప్రాంతాల నుంచి భక్తులు వేలాది సంఖ్యలో భక్తులు తరలివస్తారు. డిసెంబరు 2వ తేదీన స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి జాతర ఉత్సవాలను ప్రారంభిస్తారు. 3వ తేదీన భక్తులు వారి కోరిక మేరకు స్వామివారికి యజ్ఞయాగాలు నిర్వహిస్తారు. అలాగే 4వ తేదీన మునిరంగ స్వామి, భూదేవి అమ్మవార్లకు కళ్యాణోత్సవం నిర్వహించడంతో పాటు సాయంత్రం అంగరంగ వైభవంగా రథోత్సవం జరుగుతుందన్నారు. భక్తులకు ఏర్పాట్లు అన్నీ సిద్ధం చేశామని ఆలయ పీఠాధిపతులు శ్రీనివాసులు, పీఠాధిపతి తెలిపారు.

6న హిందూ సమ్మేళనం

మద్దికెర నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన మద్దికెర గ్రామంలో ఈ నెల 6వ తేదీన శ్రీ విజయ సాయి డిగ్రీ కళాశాల ఆవరణంలో హిందూ సమ్మేళన సమావేశం జరుగుతుందని హిందూ సమ్మేళన నిర్వహణ సమితి సభ్యులు తెలిపారు. ఆదివారం మద్దికెర గ్రామంలో హిందూ సమ్మేళన ఆహ్వాన పత్రికలను విడుదల చేశారు. వంద సంవత్సరాల్లోకి అడుగు పెడుతున్న సందర్భంగా హిందూ సమ్మేళనం నిర్వహిస్తున్నామన్నారు. ఈ సమ్మేళనంలో ప్రతి హిందువూ కుటుంబంతో రావాలన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా గురుసేవానంద స్వాముల వారు, ఆర్ఎస్ఎస్ సహప్రాంత ప్రచారక్ జనార్దన్ వస్తారన్నారు. అలాగే ఉత్సవాల్లో పాల్గొనాలని జిల్లా టీడీపీ కార్యదర్శికి ధనుంజయుడికి ఆహ్వాన పత్రికను అందజేశారు.

ఆప్టా రాష్ట్ర అధ్యక్షుడిగా కాకి ప్రకాష్

దేవనకొండ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆప్టా రాష్ట్ర అధ్యక్షుడిగా కాకి ప్రకాష్‌రావు ఎంపికయ్యారు. మచిలీపట్నంలో ఏపీ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో కర్నూలు జిల్లా కార్యదర్శి బాధ్యతలు నిర్వహిస్తున్న కాకి ప్రకాష్‌రావును రాష్ట్ర కమిటీ నూతన అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎంపిక చేశారు.



ప్రస్తుత రాష్ట్ర అధ్యక్షుడు గణపతి పదవీ విరమణ చేయడంతో అధ్యక్షుడిగా వైదొలిగారు. కాకి ప్రకాష్ రావు ప్రస్తుతం మండలంలోని మాచాపురం పాఠశాలలో విధులు నిర్వహిస్తున్నారు. ప్రకాష్‌రావు ఎంపికపై మండలంలోని ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

వీఆర్ఏ మృతి

వెల్దుర్తి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలో చెరుకులపాడు గ్రామానికి చెందిన వీఆర్ఏ లక్ష్మీదేవి (56) అనారోగ్యంతో ఆదివారం మృతిచెందింది. మృతురాలు 16 సంవత్సరాల నుంచి చెరుకులపాడు వీఆర్ఏగా విధులు నిర్వహిస్తున్నారు. ఈమె మృతికి మండల అధ్యక్షుడు అయ్యస్వామి సంతాపం వ్యక్తం చేశారు.

స్నేహితుడి కుటుంబానికి సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న స్నేహితులు

క్రిష్ణగిరి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): టి.గోకులపాడు గ్రామానికి చెందిన మునీంద్రరాజు(34)ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. స్నేహితుని కుటుంబాన్ని ఆదుకోవాలనే ఉద్దేశంతో 2005-06 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన స్నేహితులంతా కలిసి రూ.1లక్ష సేకరించారు. ఆదివారం టీ.గోకులపాడు గ్రామంలో మృతుని భార్య విజయలక్ష్మికి రూ.1లక్ష నగదును అందజేశారు. అంతకుముందు స్నేహితుని చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

హంతకులను శిక్షించాలి

దేవనకొండ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లా డీవైఎఫ్ఐ నాయకుడు పెంచలయ్యను హత్య చేసిన వారిని పట్టు కొని కఠినంగా శిక్షింలచాలని డీవైఎఫ్ఐ మండల అధ్యక్ష, కార్యదర్శులు మహేంద్ర, శ్రీనివాసులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో వారు మాట్లాడుతూ నెల్లూరు నగరంలో అసాంఘిక శక్తులు, డ్రగ్స్ ముఠా సభ్యులు రెచ్చిపోతుండటంతో ప్రజలను చైతన్యం చేస్తున్న పెంచలయ్యను గంజాయి ముఠా హతమార్చడం దారుణమని నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు. సమావేశంలో రాముడు, వీరేంద్ర పాల్గొన్నారు.

జిల్లా మహాసభలను జయప్రదం చేయాలి

వెల్దుర్తి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) జిల్లా స్వర్ణోత్సవాలు విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు కేశవ, ధోని ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డిసెంబరు 4, 5 తేదీల్లో ఆలూరులో జరిగే జిల్లా స్వర్ణోత్సవ మహాసభలకు మండలంలో ఉన్న విద్యార్థులు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రవీణ్, రాహుల్, మనోహర్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

శ్మశానంలో అభివృద్ధి పనులకు భూమి పూజ

వెల్దుర్తి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన వెల్దుర్తి బ్రాహ్మణ, బొమ్మన, ఆర్యవైశ్య కమ్యూనిటీకి చెందిన శ్మశానంలో ఆదివారం పలు అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. రూ.20 లక్షలతో శివాలయం, చెట్లపెంపకం, అస్థికలు భద్రపరిచే లాకర్ వంటివి ఏర్పాటు చేయనున్నారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిధులు సేకరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దశరథరామిరెడ్డి, సముద్రాల శ్రీరాములు, తిరువీధి రమేశ్, సాయిప్రసాద్, సముద్రాల సురేశ్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆదోని ప్రజల ఆకాంక్షను

సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తాం

- మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ
- రోజు రోజుకూ పెరుగుతున్న మద్దతు



దీక్షకు సంఘీభావం తెలుపుతున్న కోట్ల సుజాతమ్మ

ఆదోని/ఆదోని అగ్రికల్చర్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి) : పశ్చిమ ప్రాంత ఐదు నియోజకవర్గాలను కలిపి ఆదోని జిల్లా చేయాలన్న ప్రజల డిమాండ్‌ను సీఎం చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్తామని డోన్ మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ అన్నారు. ఆదివారం కోట్ల సర్కిల్‌లో ఆదోని జిల్లా సాధన సమితి చేపట్టిన నిరాహార దీక్ష శిబిరాన్ని మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ, మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి రాష్ట్ర జంగమ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మల్లికార్జున స్వామితో పాటు పలువురు వేరువేరుగా కలిసి సంఘీభావం తెలిపారు. పనుల నిమిత్తం కర్నూలుకు వెళ్లేందుకు 150 కిలోమీటర్ల పైగా ప్రయాణించాల్సిన పరిస్థితి ఉందన్నారు. ప్రజలకు పరిపాలన సౌలభ్యంతోపాటు మరింత అభివృద్ధి చెందేందుకు జిల్లా అవసరమన్నారు. దీక్షలో చైర్‌పర్సన్ లోకేశ్వరి, శ్రీ లక్ష్మీ జిలేకాబి, శోభిరాణి, మంజుల సౌజన్య రెడ్డి, వై లక్ష్మీ సుగుణమ్మ, నాగలక్ష్మి పాల్గొన్నారు.

మద్దికెర : ఆదోని జిల్లా చేయాలని జిల్లా వైసీపీ ఎస్సీ సెల్ అధ్యక్షులు రేలంపాడు వెంకటేశ్వర్లు, మండల వైసీపీ ఉపాధ్యక్షుడు కృష్ణ అన్నారు ఆదోనిని జిల్లా చేయడం వల్ల ఎంతో వెనుకబడిన ఆలూరు, పత్తికొండ ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయన్నారు ఆదోని ప్రాంతంలో వ్యాపార సముదాయాలు అధికంగా ఉన్నాయనీ, జిల్లా కేంద్రం చయడం వల్ల మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. గతంలో కూడా ఆదోనిని జిల్లా చేసేందుకు ఈ ప్రాంత ప్రజలు ఆందోళనలు చేశారని ప్రభుత్వానికి ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా వెంటనే ఆదోనిని జిల్లా చేసేందుకు పోరాడుతామన్నారు.

'జంగమ కులానికి అన్యాయం'



మాట్లాడుతున్న నాయకులు

ఆదోని, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జంగమ కులానికి తీవ్ర అన్యాయం జరుగుతోందని జంగం మహేశ్వర సంక్షేమ రాష్ట్ర అధ్యక్షులు జె.పి.మల్లికార్జునస్వామి, విజయ్‌కుమార్‌స్వామి ఆవేదన వ్యక్తం చేశారు. తమ కుల సర్టిఫికెట్లతో వేరే కులం వాళ్లు ఉద్యోగాలు పొందుతున్నారని తెలిపారు ఆదోని పట్టణంలోని గణేష్ మినీ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం రాష్ట్ర జంగమ మహేశ్వర సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. జంగమలు రాజకీయంగా, సామాజికంగా ఎంతో అభివృద్ధి సాధించాల్సిన అవసరం ఉందన్నారు. కుల ధృవీకరణ సర్టిఫికెట్లు తీవ్రంగా దుర్వినియోగం అవుతున్నాయని, ఈ సర్టిఫికెట్లను ఉపయోగించి ఇతర కులాల వారు మొన్నటి డీఎస్సీలో ఉద్యోగాలు పొందారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. ఆదోని జిల్లా ఏర్పాటుకు మద్దతు తెలుపుతూ భీమా సర్కిల్‌లోని ధర్నా చౌక్‌లో సంఘీభావం తెలియజేశారు. రాష్ట్ర అధ్యక్షులు విజయ్‌కుమార్, రుద్రయ్యస్వామి, చెన్నబసయ్యస్వామి, నాగేశ్వరయ్యస్వామి, రుద్రయ్యస్వామి, బసవరాజుస్వామి, జేపీ నాగేశ్వరయ్య, మల్లికార్జున పాల్గొన్నారు.

విద్యార్థులకు విజ్ఞాన యాత్రలు అవసరం



బెలూన్ కేవ్స్‌ను వీక్షిస్తున్న
ఆర్ఆర్ లేబర్ కాలనీ పురపాలక పాఠశాల విద్యార్థులు

ఆదోని అగ్రికల్చర్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి) : విజ్ఞాన యాత్రలు విద్యార్థులకు అవసరమని ఆర్ఆర్ లేబర్ కాలనీ పురపాలక ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవి అన్నారు. ఆదివారం విద్యార్థులకు ఎక్స్ పోసర్ విజిట్‌లో భాగంగా బెలుమ్ గుహలను విద్యార్థులు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠ్యాంశాలను పుస్తకాలలో చదవడం కంటే నేరుగా చూడడం వల్ల గుర్తుండిపోతాయన్నారు. చారిత్రక ప్రదేశాలు, విజ్ఞాన కేంద్రాలు, శాస్త్రీయ ప్రయోగశాలలు వంటివి సందర్శించడం ద్వారా విద్యార్థులు పాఠాల్లో నేర్చుకున్న విషయాలను ప్రత్యక్షంగా అనుభవిస్తారన్నారు. ప్రత్యక్ష అనుభవం వల్ల జ్ఞాపక శక్తి పెరుగుతుందన్నారు. ఉపాధ్యాయులు వీరచంద్ర యాదవ్, గిడ్డ రెడ్డి, రామకృష్ణ, అనిల్ పాల్గొన్నారు.

శనగ పంటలో జాగ్రత్తలు తీసుకోవాలి

మద్దికెర నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలో రబీలో సాగు చేసిన పప్పు శనగ పంటలో దిత్వ తుపాన్ నేపథ్యంలో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయాధికారి రవి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో మొదలు కుళ్లు, తడివేరు కుళ్లు, తెగుళ్ల ఆశించే అవకాశం ఎక్కువగా ఉంటుందని, కాబట్టి రైతులు తెగుళ్ల సోకిన మొదలు బాగం తడిచేలా లీటరు నీటికి 3 గ్రాములు మాన్‌కో జబ్లేదా కార్బెండిజమ్, మాన్‌కో జెబ్ రెండున్నర గ్రాములు కలుపుకుని మందు పిచికారి చేయాలన్నారు.

ఇది రైతుల ప్రభుత్వం

మద్దికెర, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రైతుల పక్షపాతి అని, ఇది రైతుల ప్రభుత్వం అని మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి పెరవలి రామాంజులు, మాజీ సర్పంచ్‌వెంకటరమణ, వ్యవసాయ అధికారి రవి అన్నారు. ఆదివారమ మండల పరిధిలోని పెరవలి గ్రామంలో రైతన్న మీకోసం కార్యమం జరిగింది.కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ పులిశేఖర్, మెడికల్ రాము, పెరవలి గ్రామ అధ్యక్షుడు బుగ్గా భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పనుల పరిశీలన

హాలహర్వి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మ్యాజిక్ డ్రైనేజీ నిర్మాణం పనుల్లో అమృతాపురం గ్రామం ఎంపికైందని ఏపీఓ చక్రవర్తి అన్నారు. ఆదివారం ఆయన గ్రామంలో జరుగుతున్న పనులను పరిశీలించారు. కర్నూలు జిల్లాలో మోడల్ విలేజ్‌గా అమృతాపురం ఎంపికైందని, ఈ గ్రామంలో సీసీ రోడ్లు, మ్యాజిక్ డ్రైనేజీ కాలువ నిర్మాణం పనులు చేపడుతున్నామన్నారు.

బీజేపీలోకి చేరిక

దేవనకొండ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పొట్లపాడులో దాదాపు 15 కుటుంబాలు బీజేపీ తీర్థం పుచ్చుకోవడం జరిగింది. గ్రామానికి చెందిన పలువురుని బీజేపీ జిల్లా అధ్యక్షులు అక్కమాతోట రామకృష్ణ పార్టీ కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. మండల అధ్యక్షులు బొల్లేద్దుల కిరణ్‌కుమార్, సీనియర్ నాయకులు తిమ్మప్ప, వరి, ఉపాధ్యక్షులు రంగస్వామి, హుసేని, రాముడు, తదితరులు పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్యంతో వ్యాధులు నయం

తుగ్గలి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆయుర్వేద వైద్యంతో దీర్ఘకాలిక వ్యాధులు నయం అవుతాయనీ ఆయుర్వేదిక వైద్యులు అమర్నాథ్ యాదవ్ తెలిపారు. ఆయుర్వేద వైద్యం తీసుకోవడం వల్ల ఎలాంటి సైడు ఎఫెక్ట్ లేకుండా వ్యాధులు నయం అవుతాయన్నారు. ప్రతి ఒక్కరూ సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తలు వహించాలన్నారు.

ఇసుకను అక్రమంగా తరలిస్తే చర్యలు

హొళగుంద, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ఉచితంగా అందజేసే ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై దిలీప్ కుమార్ గురుజాల అన్నారు. ప్రభుత్వం గుర్తించిన చోటు నుండి మూడు కిలోమీటర్ల దూరం నుండి మాత్రమే ఇసుక తవ్వకాలు చేపట్టాని, అలాగే ప్రభుత్వం అనుమతులు ఉన్న పనులకు అధికారుల నుండి అన్ని అనుమతులు తీసుకున్న వారే ఇసుక రవాణా చేయాలని అన్నారు. ఎవరైనా అక్రమంగా ఇసుక తవ్వకాలు చేపడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.



ఎస్ఐ దిలీప్ కుమార్

ఇసుక పేరిట టీడీపీ నాయకుల వసూళ్లు: ఎమ్మెల్యే



మాట్లాడుతున్న
ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి

హొళగుంద, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): టీడీపీ నాయకులు ట్రిప్‌నకు రూ.500 వసూలు చేస్తున్నారని ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి ఆరోపించారు. హొళగుంద మండలంలోని మార్లమడికి గ్రామంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇసుక రవాణాకుసింగిల్ విండో అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డికి ఎందుకు డబ్బులు చెల్లించాలని, ఇది ఏమైనా ఆయన జాగీరా? అని మండిపడ్డారు. ఇసుకకు ఎవరైనా డబ్బులు అడిగితే తనకు ఫోన్ చేయాలన్నారు. టీడీపీ నాయకుల వసూళ్లలో ఎస్ఐకి ఎంత వాటా ఉందని ప్రశ్నించారు. మద్యం, ఇసుక వ్యాపారాలను ఎస్ఐ ప్రోత్సహిస్తున్నారని, ఈ విషయంపై కలెక్టర్, అడిషనల్ ఎస్పీ దృష్టికి తీసుకెళ్లినట్లు ఆయన తెలిపారు.

స్కూటర్‌ను ఢీకొట్టిన ఆటో

- ఒకరికి తీవ్ర గాయాలు

ఆదోని రూరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఆదోని - ఎమ్మిగనూరు బైపాస్ సమీపంలోని ఆంజనేయస్వామి విగ్రహం వద్ద స్కూటర్‌ను ఆటో ఢీకొనడంతో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. ఎమ్మిగనూరు మండలం సిరాళదొడ్డి గ్రామానికి చెందిన వడ్డే ఉరుకుంద, శీను, లక్ష్మన్నలు ద్విచక్ర వాహనంపై ఎమ్మిగనూరు నుండి ఆదోనికి వస్తుండగా, ఆంజనేయ స్వామి విగ్రహం వద్ద కపటి గ్రామానికి చెందిన ఏపి 39 టివి 8932 నెంబరు గల ఆటో వేగంగా ఢీకొట్టింది. దీంతో స్కూటర్‌లో ఉన్న ముగ్గురికి గాయాలు తగిలాయి. స్థానికులు వీరిని ఆదోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వీరిలో ఉరుకుంద తలకు బలమైన గాయం కావడంతో వెన్నముకకు కూడ గాయమైనట్లు వైద్యులు తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే ఆటో డ్రైవర్ ప్రమాద స్థలంలో ఆటోను వదిలి పరారయ్యాడు. ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసుకొని ధర్యాప్తు చేపట్టారు.

రసాయన ఎరువుల వినియోగం తగ్గించాలి

తుగ్గలి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పంటల సాగులో రైతులు రసాయన వినియోగం తగ్గించాలని టీడీపీ మండల అధ్యక్షుడు తిరుపాల్ నాయుడు అన్నారు. ఆదివారం మండల పరిధిలోని శభాష్‌పురంలో రైతన్న మీకోసం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు వ్యవసాయాధికారుల సూచనల మేరకు పంటలు సాగు చేయాలని ప్రభుత్వం సూచించిన పంచ సూత్రాలపై ప్రతి రైతు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మోహన్, శ్రీరాములు, సోమశేఖర్ గౌడు పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్ నమూనా పరీక్షలు

ఆదోని అగ్రికల్చర్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలోని ప్రతిభ ఉన్న 8వ తరగతి విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్ షిప్(ఎన్ఎంఎంఎస్) పొందేందుకు ఏపీ స్కూల్ అసిస్టెంట్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శి చింతల సుబ్బారావు, నారోత్తమ రెడ్డి ఆధ్వర్యంలో ఎన్ఎంఎంఎస్ నమూనా పరీక్షలు ఆదివారం ఆదోని మునిసిపల్ హైస్కూల్ లో నిర్వహించారు.వి ద్యార్థులకు ఎన్ఎంఎంఎస్ స్కాలర్ షిప్ పరీక్షలపై అవగాహన కల్పిస్తూ భయాందోళన వీడేందుకు మోడల్ టెస్ట్ నిర్వహించడం జరుగుతుందన్నారు. . రాష్ట్ర వ్యాప్తంగా ప్రశ్నపత్రాల ప్రింట్‌కు సహకరించిన దాతలు, ఏ రెడ్డి విట్టల్, పీ విష్ణు వర్ధన్ రెడ్డికు కృతజ్ఞతలు తెలిపారు. ఇన్‌చార్జి హెచ్ఎం సుధాకర్, ఉపాధ్యాయులు పీ కోటన్న, సీ ఈరన్న, రామాంజినేయులు, శంకరయ్య, శ్రీదేవి పాల్గొన్నారు.

'కలసికట్టుగా పనిచేయాలి'



మాట్లాడుతున్న గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం

ఆలూరు(హొళగుంద), నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆలూరు నియోజకవర్గంలో అందరూ కలిసి పని చేయాలని గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం అన్నారు. హొళగుందలో ఓ వివాహ కార్యక్రమానికి హాజరైన ఆయన స్థానిక నాయకులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 25 ఏళ్లుగా ఐక్యత లేకపోవడంతో టీడీపీ జెండా ఎగరలేక పోతుందన్నారు. గత ఎన్నికల్లో స్వల్ప మెజార్టీతో టీడీపీ అభ్యర్థి ఓటమి పాలయ్యాడన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎంపీటీసీ, జెడ్పీటీసీ, సర్పంచ్ ఎన్నికల్లో టీడీపీ జెండా ఎగర వేయాలంటే సీనియర్ నాయకులను కలుపుఉపోతే అన్ని గ్రామాల్లో టీడీపీ జెండా ఎగురవేయడం ఖాయమన్నారు. సమావేశంలో మాజీ దేవరగట్టు ఆలయ చైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ గుమ్మనూరు నారాయణ, టీడీపీ మండల కన్వీనర్ తిప్పయ్య, సీనియర్ నాయకులు పంపాపతి పాల్గొన్నారు.

పేదలందరికీ ఇళ్ల స్థలాలు



స్థలాలను పరిశీలిస్తున్న తహసీల్దార్ గూండాల్ నాయక్

మద్దికెర, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లో ఇళ్ల స్థలాలు లేని పేదలను గుర్తించి అర్హులైన వారికి ఇల్ల స్థలాలు అందేచూస్తామని తహసీల్దార్ గూండాల్ నాయక్ తెలిపారు. ఆదోని మండల కేంద్రంలోలోని కుక్కల బావి వద్ద ప్రభుత్వ భూమిని పరిశీలించారు. మండల పరిధిలోని మద్దికెర, ఎం.అగ్రహారం, పెరవలి గ్రామాల్లో ప్రభుత్వ స్థలాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రతి పేదవారికి 3 సెంట్ల స్థలాన్ని ఇచ్చేవిదంగా చూస్తామని అన్నారు. ఆర్ఐ రామాదను, వీఆర్వో రంగస్వామి, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

చంద్రబాబుతోనే పల్లెల అభివృద్ధి



మాట్లాడుతున్న టీడీపీ రాష్ట్ర
కార్యనిర్వాహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర

తుగ్గలి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రతి పల్లెలో అభివృద్ధి పనులు చేపట్టిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకే దక్కుతుందని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తిమ్మయ్య చౌదరి అన్నారు. ఆదివారం తుగ్గలిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మండలంలో ప్రతి గ్రామంలో కూటమి ప్రభుత్వం వచ్చిన నెల రోజులకే సీసీ రోడ్లతో పాటు మజారా గ్రామాలకు అవసరమైన బీటీ, సీసీ రోడ్లు వేసిన ఘనత పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబుకే దక్కుతుందన్నారు. అంతేగాకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించారన్నారు.

చెత్త వేస్తే రూ.2 వేలు జరిమానా

మద్దికెర, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మద్దికెర గ్రామంలోని మంగళవీధిలో ప్రజలకు ఇబ్బందికరంగా రోడ్డుపైనే చెత్త వేస్తుండడంతో పంచాయతీ వారు ఆ ప్రాంతంలో చెత్త వేస్తే రూ.2వేలు జరిమానా హెచ్చరిస్తూ బోర్డు ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతంలో చెత్త వేయద్దని పలుమార్లు హెచ్చరించినప్పటికీ కొంత మంది అలాగే చెత్త వేస్తుండటంతో బోర్డును ఏర్పాటు చేశారు. పంచాయతీ కార్యదర్శి శివకుమార్ మాట్లాడుతూ చెత్త వేస్తే రూ.2వేలు జరిమానా విధించడం జరుగుతుందని ఆయన తెలిపారు. త్వరలోసీసీ కెమెరాలు కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు

హాలహర్వి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కర్నూలు-బళ్లారి జాతీయ రహదారిపై డ్రైవర్లు మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ మారుతి అన్నారు. ఆదివారం రాకపోకలు కొనసాగించే వాహనాలను ఆయన తనిఖీ చేశారు. వాహనదారులు అతివేగం ప్రమాదానికి కారణమని, మద్యం సేవించి వాహనాలు నడిపితే ప్రమాదాల బారినపడే అవకాశం ఉందన్నారు.

ఉపాధ్యాయులకు ఆటవిడుపు అవసరం

ఆదోని అగ్రికల్చర్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు పాఠాలు బోధనతోపాటు ఆటవిడుపు కూడా అవసరమని మండల విద్యాశాఖ అధికారులు భూపాల్ రెడ్డి, శ్రీనివాసులు అన్నారు. ఆదివారం మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల క్రికెట్ జట్లు ఎంపిక జరిగింది. ప్రభుత్వం ఉపాధ్యాయులు మానసిక ఉల్లాసాన్ని కలిగించేలా పోటీలను నిర్వహిస్తుందన్నారు. ఎంపికైన క్రీడాకారులను అభినందించారు.

పత్తికొండ: రెండు రోజులుగా పత్తికొండ క్రీడా మైదానంలో జరుగుతున్న ఉపాధ్యాయుల క్రికెట్ పోటీల్లో దేవనబండ కాంప్లెక్స్ టీమ్ విజేతగా నిలిచింది. పత్తికొండ మండల పరిధిలో ఐదు కాంప్లెక్స్ టీమ్‌లు పోటీల్లో పాల్గొనగా పందికోన, దేవనబండ టీమ్‌లు ఫైనల్‌కు చేరుకున్నాయి. ఫైనల్‌లో దేవనబండ టీమ్ విజేతగా నిలిచింది.

'పెద్దహరివాణంలో చేర్చవద్దు'

ఆదోని రూరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మా గ్రామాలను నూతనంగా ఏర్పడ్డ పెద్దహరివాణం మండలంలో చేర్చవద్దని గణేకల్లు, నారాయణపురం, చాగి, మదిరె, ఢణాపురం గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. నూతన మండలాల్లో భాగంగా, ఆదోని మండలాన్ని ప్రభుత్వం ఆదోని, పెద్దహరివాణం మండలంగా విభజించింది. పెద్దహరివాణం మండలంలో నారాయణపురం, చాగి, ఢణాపురం, మదిరె, గణేకల్లు, పాడేగల్లుతోపాటు మరో 11 గ్రామాలను విలీనం చేసింది. దీంతో ఆయా గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆదోనికి 5నుంచి 10కి.మీ., దూరంలో ఉన్న తమ గ్రామాలను 35కి.మీ., దూరంలో ఉండే పెద్దహరివాణం మండలంలో ఏలా కలుపుతారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే ప్రభుత్వం, అధికారులు దిగి వచ్చి ప్రజాభిప్రాయ సేకరణ తీసుకొని తమ గ్రామాలను ఆదోని మండలంలో ఉండేవిధంగా చర్యలు చేపట్టాలన్నారు. లేనిపక్షంలో ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. ఇందులోభాగంగానే ఆదివారం గణేకల్లు, పాండవగల్లు గ్రామస్థులు ప్రధాన రహదారిపై బైఠాయించి ఆందోళన చేశారు. నారాయణపురం గ్రామస్థులు గ్రామ సమావేశం నిర్వహించి పోరాటానికి సిద్ధం కావాలని సూచించారు. మదిరె గ్రామస్థులు సైతం ఆదోని - శిరుగుప్ప బైపాస్ రహదారిపై బైఠాయించి ఆందోళనకు దిగారు. మరో ప్రక్క పెద్దతుంబళం, చుట్టు ప్రక్కల గ్రామాల ప్రజలు పెద్దతుంబళం గ్రామాన్ని మండల కేంద్రంగా చేయాలని ఆందోళనబాట పట్టారు. దీంతో ఆదోని నియోజకవర్గంలో రోజు ఎక్కడో ఒక చోట ఆందోళనలు జరుగుతూనే ఉన్నాయి.



గణేకల్లు రహదారిలో రాస్తారోకో చేస్తున్న గ్రామస్థులు

సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యం : టీడీపీ



నందవరంలో కరపత్రాలు అందజేస్తున్న టీడీపీ మండల కన్వీనర్

నందవరం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): అర్హులైన అందరికీ సంక్షేమ పథకాలు అందించడమే టీడీపీ లక్ష్యమని ఏపీ బీసీ కో- ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ దేవళ్ల రాముడు అన్నారు. ఆదివారం నందవరంలో టీడీపీ మైనార్టీ నాయకులు రహిమాన్ ఆధ్వర్యంలో రైతన్న మీ కోసం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలు అందజేశారు. కూటమి ప్రభుత్వం అందించిన పథకాల ప్రయోజనాల గురించి వివరించారు. రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ కాశీంవలి, సహకార సంఘం మండల అధ్యక్షుడు ధర్మాపురం గోపాల్, నాయకులు డీవీ రాముడు, లచ్చప్ప, మస్తాన్,షరీఫ్, సుదీర్, నల్లంగి మల్లికార్జున, వీబూతి మల్లప్ప, ఒంటెద్దు రంగయ్య, సుదీర్, నరసప్ప, వెంకటేష్, సత్యారెడ్డి, వడ్డే గోపాల్ పాల్గొన్నారు.

ధార్మిక పర్యటనకు వెళ్లిన పీఠాధిపతి

మంత్రాలయం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్రస్వామి మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు ధార్మిక పర్యటనకు వెళ్లారు. ఆదివారం మంత్రాలయం మఠంలో పూజలు ముగించుకొని తన శిష్యబృందంతో కలిసి తమిళనాడులోని కుంభకోణానికి బయలుదేరి వెళ్లారు. మూడురోజుల పాటు విజయీంద్ర తీర్థుల సన్నిధిలో పూజలుచేసి భక్తులను ఆశీర్వాదించనున్నారు. డిసెంబరు 4న మంత్రాలయానికి చేరుకుంటారని ఏఏవో మాధవశెట్టి, మఠం మేనేజర్ ఎస్కే శ్రీనివాసరావు, శ్రీపతి ఆచార్ తెలిపారు.

ప్రైవేటీకరించవద్దు : వైసీపీ



ముగతిలో సంతకాలు సేకరిస్తున్న వైసీపీ నాయకులు

నందవరం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేయొద్దని వైసీపీ యువజన జిల్లా ప్రధాన కార్యదర్శి దేవపాల్ డిమాండ్ చేశారు. కోటి సంతకాల సేకరణలో భాగంగా గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఇంటింటా తిరుగుతూ సంతకాలు సేకరించారు. ఆయన మాట్లాడుతూ పీపీపీ విధానం వల్ల పేద విద్యార్థులకు కలిగే నష్టాలను వివరించారు. కార్యక్రమంలో నాయకులు చిన్నన్న, దేవపుత్ర, దావీదు, సామేలు, అబ్రహాం, ప్రకాశం, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

మంత్రాలయానికి పోటెత్తిన భక్తులు



భక్తులతో కిటకిటలాడుతున్న శ్రీమఠం ప్రాంగణం

మంత్రాలయం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి దర్శనార్థం వచ్చిన భక్తులతో సందడిగా మారింది. మార్గశిర దశమి ఆదివారం కావటంతో ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. మఠం ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది. అన్నపూర్ణ భోజనశాల, మహాముఖద్వారం, మధ్వమార్గ్, తుంగభద్ర, వేదపాఠశాల కారిడార్లు, ప్రధాన రహదారులు, రాఘవేంద్ర సర్కిల్, తుంగభద్ర నది తీరం భక్తులతో కోలాహలంగా మారింది. తుంగభద్ర నదిలో పుణ్య స్నానాలు ఆచరించి గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకొని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. రథోత్సవాల ఊరేగింపులో పాల్గొని భక్తులు మఠం పండితుల ఆశీస్సులు పొందారు.

నేడు నిజ బృందావనం దర్శనం

మంత్రాలయం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): నేడు ఏకదశి సందర్భంగా రాఘవేంద్రస్వామి మఠంలో నిజ బృందావనం దర్శన భాగ్యం కల్పించనున్నట్లు మఠం అధికారులు ఆదివారం తెలిపారు. బృందావనానికి నిత్యం జరిగే అభిషేకాలు, అలంకరణ, నిత్యాన్నదానం, టెంకాయ కొట్టడం, రథోత్సవాలు ఊరేగింపు, పరిమళ ప్రసాదం వితరణ ఉండదన్నారు. కేవలం బృందావనానికి నిర్మల విసర్జనం, అలంకరణ లేని రాఘవేంద్రస్వామి నిజ బృందావనాన్ని భక్తులు దర్శించుకొనే అవకాశం మాత్రమే ఉంటుందన్నారు.

రమణీయం.. ప్రహ్లాదరాయల రథోత్సవం



వెండి రథంపై ఊరేగుతున్న ప్రహ్లాదరాయలు

మంత్రాలయం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు వెండి రథంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఆదివారం మార్గశిర దశమి శుభ దినాన్ని పురస్కరించుకుని మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో అర్చకులు బృందావనానికి, మంచాలమ్మ దేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బృందావనాన్ని, మంచాలమ్మను బంగారు, వెండి, పట్టువస్త్రాలు, ప్రత్యేక పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. పూర్ణబోధపూజ మందిరంలో ఉత్సవమూర్తికి పాదపూజ చేసి పల్లకిలో ఊరేగించారు. పీఠాధిపతి స్వహస్తాలచే మూల రాములు, జయరాములు, దిగ్విజయరాములకు బంగారు నాణేలతో అభిషేకం చేశారు. అనంతరం వెండి రథాన్ని వివిధ పుష్పాలతో అలంకరించి, వేద పండితుల మంత్రోచ్ఛరణాలు, మంగళ వాయిద్యాల మధ్య ప్రహ్లాదరాయలను అధిష్టించి పండితులు మహామంగళహారతులు ఇచ్చి ఆలయ ప్రాంగణం చుట్టూ ఊరేగించారు. అనంతరం ఊంజలసేవ నిర్వహించారు. పీఠాధిపతి భక్తులను ఆశీర్వాదించారు.

భగవద్గీత పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

పెద్దకడబూరు , నవంబరు 30(ఆంధ్రజ్యోతి): గీతా జయంతిని పురస్కరించుకొని కర్నూలు నగరంలో విద్యార్థులకు నిర్వహించిన భగవద్గీత పోటీల్లో పెద్దకడబూరులోని జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు పాఠశాల ఉపాధ్యాయురాలు సువర్ణ తెలిపారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ పాఠశాలకు చెందిన పవన్‌కుమార్ మొదటి బహుమతి రూ.1,116 నగదుతోపాటు ప్రశంసాపత్రం, జ్ఞాపికను అందుకున్నట్లు తెలిపారు. తృతీయా బహుమతి లక్ష్మీకాంత్ రూ. 516 నగదులతోపాటు ప్రశంసపత్రం, జ్ఞాపికను అందుకున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరు గీతా సారాంశాన్ని తెలుసుకోవాలన్నారు.

వైసీపీలో ఫ్లెక్సీల రగడ

● మాజీ ఎంపీ బుట్టా ఆఫీసు వద్ద ఫ్లెక్సీలు చించివేత
● ఫుటేజ్‌లో రికార్డు అయిన దృశ్యం
● పోలీసులకు ఫిర్యాదు చేసిన బుట్టా నీలకంఠ

ఎమ్మిగనూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): వైసీపీలో ఫ్లెక్సీల రగడ మొదలైంది. పట్టణంలోని కర్నూలు పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయ కర్త బుట్టా రేణుక కార్యాలయం ఆవరణలో ఈనెల 27న అర్ధరాత్రి గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు ఫ్లెక్సీలు చించివేశారు. ఇద్దరు యువకులు బుట్టా రేణుక కార్యాలయం వద్దకు వచ్చినట్లు సీసీ ఫుటేజ్‌లో స్పష్టంగా కనిపిస్తుంది. ఇది కాస్త సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. వైసీపీలో అంతర్గత విభేదాల కారణంగానే ఫ్లెక్సీల చించివేసినట్లు చర్చించుకుంటున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో అప్పటి ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవ రెడ్డిని కాదని బీసీలలో చేనేత సామాజిక వర్గానికి చెందిన బుట్టా రేణుకకు జగన్ టికెట్ ఇచ్చారు. అప్పట్లో ఆయన వర్గీయులు దీన్ని జీర్ణించుకోలేకపోయారు. ఎన్నికల్లో ఓటమి తరువాత ఎమ్మిగనూరు నియోజకవర్గం వైసీపీ ఇన్‌చార్జిగా బుట్టా రేణుక కొనసాగించారు.



వైసీపీ కార్యాలయం దగ్గర ఇద్దరు యువకుల సంచారం

ఏడాదిన్నర కాలంలోనే..

ఏడాదిన్నర కాలంలో ఆమె నియోజకవర్గంలో బలమైన వర్గాన్ని ఏర్పాటు చేసుకొని పట్టు సాధిస్తూ వచ్చారు. ఎక్కడ తమ రాజకీయ ఉనికి ప్రశ్నార్థకంగా మారుతుందోనని గ్రహించిన మాజీ ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవ రెడ్డి వైసీపీ అధినేత జగన్‌పై ఒత్తిడి తెచ్చి బుట్టా రేణుకను ఇన్‌చార్జిగా తొలగించారు. తన మనవడు కడిమెట్ల రాజీవ్ రెడ్డిని ఇన్‌చార్జిగా నియమించుకునేలా చేశారు. బీసీ చేనేత వర్గానికి చెందిన బుట్టా రేణుకను తొలగించటంపై బీసీ వర్గాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. అదే సమయంలో తన వర్గానికి అందుబాటులో ఉండేందుకు మాజీ ఎంపీ బుట్టా రేణుక, ఆమె భర్త, వైసీపీ నాయకుడు నీలకంఠ వైసీపీ కార్యాలయాన్ని శిల్పా ఎస్టేట్‌లో నిర్వహిస్తున్నారు.

వ్యూహాత్మకంగా రాజకీయ పావులు..

బయటకు మాత్రం కలిసి పనిచేస్తామని చెబుతున్నా.. లోపల బుట్టా వర్గీయులను అణచి వేసేందు ఎర్రకోట వ్యూహాత్మకంగా రాజకీయ పావులు కదుపుతున్నారు. ఈ సమయంలో బుట్టా రేణుక కార్యాలయం వద్ద గుర్తుతెలియని వ్యక్తులు ఫ్లెక్సీలు చించివేయటం రాజకీయంగా చర్చగా మారింది. ఎర్రకోట వర్గీయులే ఈ దుశ్చర్యకు పాల్పడి ఉంటారని ఆమె వర్గీయులు అనుమానిస్తున్నారు. ఫ్లెక్సీల చించివేతపై మాజీ ఎంపీ బుట్టా రేణుక భర్త, వైసీపీ నాయకుడు బుట్టా శివనీలకంఠ పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. ఈ విషయంపై సీఐ శ్రీనివాసులును వివరణ కోరగా విచారించి చర్యలు తీసుకుంటామన్నారు.



పట్టణంలోని శిల్పాకాలనీలో వైసీపీ కార్యాలయం సమీపంలో చించివేసిన బుట్టా ఫ్లెక్సీ



ప్రమాదాల నివారణే లక్ష్యం : ఎస్ఐ

● బారికేడ్ల ఏర్పాటు



బనవాసి ఫారంలో బారికేడ్లను ఏర్పాటు చేస్తున్న రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు, పోలీసు సిబ్బంది

ఎమ్మిగనూరు రూరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రమాదాల నివారణే తమ లక్ష్యమని ఎమ్మిగనూరు రూరల్ ఎస్ఐ కె.శ్రీనివాసులు అన్నారు. ఆదివారం ఎమ్మిగనూరు మండల పరిధిలోని ఆదోని రహదారిలో మలుపుల దగ్గర బారికెడ్లను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదోని రహదారిలో ఉన్న మలుపుల్లో ప్రమాదాలు అధికమయ్యాయన్నారు. ప్రమాదాలను నివారించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రతి ఒక్కరు ఇంటి నుంచి వాహనంపై బయల్దేరే సమయంలో తమకు ఓ కుటుంబం ఉందని గుర్తించుకోవాలన్నారు. నిర్ణీతవేగంతో వాహనాన్ని నడపాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌సీ చంద్ర, పీసీలు మల్లయ్య, రమేష్, తిప్పన్న, తుకారాము, మునాఫ్, సర్వేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

శ్మశాన వాటికా? మురుగు కుంటా..?



కోసిగిలోని సిద్ధప్పపాలెం దళితుల శ్మశాన వాటికలో నిండిపోయిన మురుగు

కోసిగి, నవంబరు 30 (ఆంధ్ర జ్యోతి): మండల కేంద్రంలోని సిద్దప్పపాలెం కాలనీకి చెందిన హిందువులు, దళితుల శ్మశాన వాటిక మురుగు కుంటను తలపిస్తుంది. వర్షాకాలంలో వర్షం నీటితో పాటు డ్రైనేజీ నీరు కూడా శ్మశాన వాటికలో చేరడంతో ఆకరి మజిలీకి అవస్థలు ఎన్నో.. అలాగే ముళ్లపొదలు నిండిపోయాయి. ఎవరైనా మరణిస్తే అంత్యక్రియలు నిర్వహించే సమయంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏళ్ల తరబడి శ్మశాన వాటికకు దారి లేక అవస్థ పడుతున్నామన్నారు. పాలకులు, అధికారులు, ప్రజలు స్పందించి సిద్దప్పపాలెం శ్మశాన వాటికను బాగు చేయాలని కోరుతున్నారు.

కష్టపడేవారికి సముచిత స్థానం

టీడీపీ అబ్జర్వర్ రామకృష్ణ



సుంకేశ్వరిలో టీడీపీ బూత్ కమిటీ నియామక పత్రాలను అందజేస్తున్న టీడీపీ అబ్జర్వర్ రామకృష్ణ, రాకేష్‌రెడ్డి, చావడి వెంకటేష్

మంత్రాలయం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పార్టీ కోసం కష్టపడే నాయకులకు, కార్యకర్తలకు సముచిత స్థానం ఉంటుందని టీడీపీ బూత్ కమిటీల అబ్జర్వర్ రామకృష్ణ అన్నారు. ఆదివారం మండలంలోని సుంకేశ్వరి గ్రామంలో బూత్‌కమిటీ నాయకులుగా ఎన్నికైన వారికి నియామక పత్రాలను అందజేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఒకవైపు సంక్షేమం, అభివృద్ధి, సంపద సృష్టించేందుకు సీఎం చంద్రబాబు అహర్నిశలు కృషిచేస్తున్నారని అన్నారు. నియోజకవర్గంలోని ప్రజలకు సంక్షేమ పథకాలు అందేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ యువనాయకుడు రాకేష్ రెడ్డి, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి చావడి వెంకటేష్, నాయకులు రామలింగప్ప, రంగస్వామి, భీరప్ప, అయ్యప్ప, రంగడు, లక్ష్మీరెడ్డి, భూషప్ప, లక్ష్మన్న, వీరారెడ్డి పాల్గొన్నారు.

గ్రాసం.. బహు భారం

● ఒక్కో ట్రాక్టర్ రూ.15 వేలు ఆపైనే



మంత్రాలయం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మూగజీవాల కోసం రైతులు పశుగ్రాసాన్ని వేలు ఖర్చు చేసి కొనుగోలు చేయాల్సి వస్తోంది. ఒక్కో ట్రాక్టర్ గ్రాసం రూ.15 వేలు ఆపై పెట్టాల్సిందే. ఆంధ్రలో పశుగ్రాసం కొరత తీవ్రంగా ఉండడంతో పక్కనే ఉన్న కర్ణాటకకు వెళ్లి పంట కోయక ముందుగానే అడ్వాన్సులు చెల్లించి గ్రాసాన్ని దక్కించుకుంటున్నారు. ఈ ఏడాది నదితీర గ్రామాల్లో వరికి బదులు పత్తి, మిరప పంటలు సాగుచేయడంతో పశుగ్రాసానికి డిమాండ్ పెరిగింది. కొంతమంది రైతులు గ్రాసం కొనలేక మూగజీవాలను ఎమ్మిగనూరు సంతలో అమ్మేసుకుంటున్నారు. గత ఏడాది ఒక్కో ట్రాక్టర్ వరిగ్రాసం రూ.11వేలు ఉండగా ఈ ఏడాది అమాంతంగా రూ.15వేల నుంచి రూ. 17వేలకు పెరగడంపై రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఆంజనేయస్వామి ఆలయానికి షెడ్డు ఏర్పాటు



భక్తుడు ఏర్పాటు చేయించిన షెడ్డు

మంత్రాలయం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం సమీపంలో వెలసిన కొండాపురం ఆంజనేయస్వామి ఆలయం చుట్టూ రూ.3లక్షల ఖర్చుతో మంత్రాలయానికి చెందిన కుమారస్వామి కుటుంబ సభ్యులు నూతన షెడ్డును ఏర్పాటు చేశారు. ఆదివారం పూజలు చేసి ప్రారంభించారు. ఆంజనేయస్వామికి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణచేసి మొక్కులు తీర్చుకున్నారు. దాత కుమారస్వామి దంపతులకు ఆలయ అర్చకులు అండె హనుమంతు, గోపాల్, గంగపుత్రుల సంఘం అధ్యక్షులు శాంతయ్యలు శాలువా, పట్టువస్త్రాలు, స్వామి వారి ప్రసాదం ఇచ్చి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జనార్దన్‌రెడ్డి, నరసింహ, భీమేష్, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురికి గాయాలు

ఎమ్మిగనూరు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని కే తిమ్మాపురం గ్రామ సమీపంలో ఆదివారం రెండు మోటారు సైకిళ్లు ఢీకొని ముగ్గురుకి గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు.. దైవందిన్నె గ్రామానికి చెందిన రంగప్ప, అనసూయమ్మ మోటారు సైకిల్‌పై ఎమ్మిగనూరు వైపునకు వస్తుండగా, ఏనుగబాల గ్రామానికి చెందిన ఓ వ్యక్తి మోటారు సైకిల్‌పై ఎమ్మిగనూరు వైపునుంచి వెళ్తూ ఎదురెదురుగా ఢీకొన్నారు. దీంతో అనసూయమ్మ, రంగప్పలకు రక్తగాయాలు కాగా, మరో వ్యక్తికి గాయాలయ్యాయి. ముగ్గురిని 108లో స్థానికులు ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసునమోదు చేసుకున్నారు.

వన్ వే ఏర్పాటు చేసి ప్రమాదాలు నివారించాలి

ఎమ్మిగనూరు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ఆదోని మండలం ఆరేకల్ గ్రామ సమీపంలో 167 జాతీయ రహదారిలో ఉన్న మలుపు నుంచి కోటేకల్ గ్రామ అడ్డరోడ్డు వరకు వన్ వే ఏర్పాటు చేయాలని కోటేకల్ గ్రామ సర్పంచ్ జాలవాడి లక్ష్మి, వైసీపీ నాయకులు జాలవాడి లక్ష్మన్న ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం వారు మాట్లాడుతూ ఆదోని - ఎమ్మిగనూరు జాతీయ రహదారిలోని కోటేకల్ మలుపుల దగ్గర తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఈ ప్రమాదాలను నివారించలంటే ఆరేకల్ మలుపునుంచి కోటేకల్ మలుపు వరకు వన్ వే ఏర్పాటు చేయాలన్నారు. కోటేకల్ అడ్డ రోడ్డునుంచి ఆరేకల్ మిట్ట వరకు జాతీయ రహదారిని మరింత వెడల్పు చేసి వన్ వే చేయటం వల్ల ప్రమాదాలు తగ్గుతాయన్నారు.

అమరులను స్మరించుకోవాలి



చంద్ర పుల్లా రెడ్డి చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు

ఎమ్మిగనూరు టౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పోరాటబాటలో అమరులైన వారిని స్మరించుకోవాలని భారతప్రగతి శీల యువజన జిల్లా కార్యదర్శి చిన్ని ప్రసాద్ అన్నారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో సీపీఐ (ఎంఎల్) నేత చంద్ర పుల్లారెడ్డి వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. చంద్ర పుల్లారెడ్డి ఆశయాలను కొనసాగిస్తూ యువత ఉద్యమాల్లో పాల్గొనాలని ప్రసాద్ కోరారు. కార్యక్రమంలో ఏనుగువాల గులకన్నా, సాల్మాన్ రాజ్, మధు తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్, గంజాయి ముఠాలను అరెస్ట్ చేయాలి



సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన చేస్తున్న నాయకులు

ఎమ్మిగనూరు టౌన్, నవంబరు 30 (ఆంధ్ర జ్యోతి) : సీపీఎం నాయకుడు పెంచలయ్యను దారుణంగా హత్య చేసిన డ్రగ్స్, గంజాయి ముఠాను అరెస్ట్ చేయాలని ఆ పార్టీ పట్టణ కార్యదర్శి గోవిందు డిమాండ్ చేశారు. ఆదివారం సీపీఎం, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో సోమప్ప సర్కిల్‌లో ధర్నా చేపట్టారు. గోవిందు మాట్లాడుతూ మంచి కోసం తమ పార్టీ నాయకులు పోరాడుతారన్నారు. ఇలాంటి దాడులకు భయపడేది లేదని, తమ పోరాటాలు మరింత ఉధృతం చేస్తామన్నారు. గంజాయి ముఠాను అరెస్ట్ చేసి, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సురేష్, నాయకులు పాల్గొన్నారు.



పల్లెపాడులో పొలంలో ఆరబెట్టిన పండు మిర్చి



దెబ్బతిన్న కాయ

పండు మిర్చి రైతును

ముంచుతున్న పొగ మంచు

● పొగ మంచు కారణంగా రైతన్నకు తీవ్ర నష్టం ● తగ్గిన దిగుబడి.. పతనమైన ధర

కోసిగి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పొగమంచు కారణంగా పండుమిర్చి రైతులకు తీవ్ర నష్టం చేకూరుతుంది. ముఖ్యంగా మండలంలోని కోసిగి, చింతకుంట, పల్లెపాడు గ్రామాల్లో అధికంగా రైతులు పండుమిర్చిని సాగు చేశారు. అయితే.. ఈ ఏడాది ఎండుమిర్చి పొగ మంచు కారణంగా రైతుకు తీవ్ర నష్టం కలిగించిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పొగ మంచు కారణంగా పండుమిర్చి పై మచ్చలు వచ్చి పూర్తిగా కాయలు తెల్లగా మారుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం రూ.10వేలు కూడా క్వింటం ధర పలకడం లేదని వాపోతున్నారు. మండలంలో ఎండుమిర్చి రైతులకు తీవ్రనష్టం వాటిల్లింది.



కోసిగిలో పంటలపై ముసురుకున్న మంచు

పొగ మంచు వల్లే తీవ్ర నష్టం



పొగ మంచు కారణంగా ఈ ఏడాది మిర్చికి కుల్లు, మచ్చలు వచ్చి తీవ్ర నష్టం కలిగించింది. మిర్చికి ధర కూడా లేకపోవడంతో క్వింటం రూ.12వేలకు మించి పలకడం లేదు. ఈ ఏడాది రైతులకు తీవ్ర నష్టం జరిగింది. మూడేళ్ల నుంచి పండుమిర్చి రైతుల పరిస్థితి బాగాలేదు. ప్రభుత్వమే తమను ఆదుకోవాలి.

- పడిగిరి పెద్ద లక్ష్మన్న, రైతు, పల్లె పాడు